జమాదిఉస్సానీ హిజ్రీ శకం 1434

AL - HiLaL

నెలవంక

కువైట్ పత్రిక

Vol 8, Issue: 67 May - 2012

nelavankaonline.com

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

May .indd 1 5/5/12 2:00 PM

ఈగ

ఉపమానం

"ఓ ప్రజలారా! ఒక ఉపమానం వివరించబడితోంది-శ్రద్ధగా వినండి. అల్లాహ్‌ను వదలి మీరు ఎవరినయితే మొర పెట్టుకుంటు న్నారో-వారంతా ఏకమై ఒకే ఒక్క ఈగను సయితం సృష్టించ లేరు. పైగా ఈగ వారి నుండి ఏదైనా వస్తువును ఎగరేసుకుపోతే వారు దాన్ని సయితం దాన్నుండి విడిపించుకోలేరు. అర్థించేవాడు, అర్థించ బడేవాడు ఇద్దరూ బలహీనులే". (దివ్యఖుర్‌ఆన్- 22: 73)

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HILAL

హిజ్రీ శకం 1434

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 67

May - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
ISLAM PRESENTATION COMMITTEE
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net

ఈ సంచికలో....

విశ్వాసం - ఆత్మ విశ్వాసం

ఇస్లాం పిలుపు

కువైట్ ఆకర్షణా కేంద్రాలు

ఎస్.సి. కార్లల్లో, బస్సుల్లో స్కూలుకెళుతూ, ఎస్.సి. తరగతి గదుల్లో చదువు'కొని' ఎస్.సి. హాస్టళ్ళలో ఇంటర్ అయిం దనిపించిన కార్పొరేట్ విద్యార్థులెవ్వరికీ స్టేట్ ఫస్ట్ రాలేదు. కరీమ్ నగర్లో ఒక మామూలు మండలంలో చదువుకున్న అటుకుల రాహుల్ 989 మార్కులతోనూ, సుబ్రమణ్యం 994 మార్కులతోనూ రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచారు! తల్లిదండ్రులు పేదవారు! రేకుల షెడ్డులో చదువుకున్న సాయి ప్రసాద్ 986 మార్కులతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రం స్థాయిలో తొమ్మిదో స్థానం సాధించాడు. మార్కులకు, జ్ఞానార్జనకు 'తొంగామా' అవసరం లేదని నిరూపించిన ఈ భావి తారులకు, శ్రమకోర్చి వారిని చదివించిన వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు

విశ్వాసం - ఆత్మ విశ్వాసం	2	ఇస్లాం పిలుపు	12
సమాజానికి పట్టిన చీడ....	4	పరదా పాటించమని చెప్పిందెవరు?	14
కువైట్ ఆకర్షణా కేంద్రాలు	6	ముస్లిం జీవితానికి సంబంధించిన...	16
ఇస్లామీయ సంస్కృతి-శిక్షాస్మృతి	8	ఐపిసి వార్తలు	17
అగ్రజుల (స) వారు అలిగిన వేళ	10	మానవ మహోపకారి ముహమ్మద్ (స)	18
		పాకశాల కువైటీ వంటకాల పాఠశాల	20

الايمان والثقة بالنفس - الربا كارثة للمجتمع - الأماكن الترفيهية الأخرى في الكويت - التوازن الحميد بين العاطفة والعقل الرشيد - مواقف غضب فيها النبي صلى الله عليه وسلم - رسالة الإسلام - يا أختي من أمرك بالحجاب - خذ عقيدتك من الكتاب والسنة - اخبار اللجنة - الرجل العظيم - الطبخ الكويتي - الأدب مع الله

విశ్వాసం - ఆత్మ విశ్వాసం

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

విశ్వాసం – విధేయత అనేది మానవ సిద్ధమయిన భావన. అది ప్రతి మనిషిలోనూ జన్మతా ఉంటుంది. ఈ కారణంగానే శిశువు తల్లిని విశ్వసిస్తుంది. ఆమె ఎవరిని తండ్రిగా పరిచయం చేస్తుందో ఆ వ్యక్తిని తండ్రిగా నమ్ముతుంది. ఒక దశకు చేరుకునే వరకు తల్లిదండ్రుల ప్రతి కదలికను, మాటను అనుకరిస్తుంది. తల్లి దండ్రులు తనను మోసగించరన్న నమ్మకం వల్లనే శిశువు అలా ప్రవర్తిస్తుంది. అయితే అనేక విషయాల్లో నిజాయితిగా వాత్స ల్యాన్ని పంచిన తల్లిదండ్రులు, కొన్ని సందర్భాల్లో తెలియనితనం వల్లనో, పూర్వీకుల ఆచారాల పట్ల తమకున్న మమకారం వల్లనో, ప్రాంతం, పరిసరాలు, ప్రజల ప్రలోభం వల్లనో కొన్ని విషయాల ను శిశువు మీద రుద్ది, దాని నమ్మకాన్ని వమ్ము చేస్తుంటారు. **'పుట్టే ప్రతి శిశువు ప్రకృతి ధర్మం మీదే పుడుతుంది. కాని, ఆ శిశువు తల్లిదండ్రులు దాన్ని మజూసీగానో, యూదునిగానో, క్రైస్తవునిగానో మార్చి వేస్తారు'** అన్న ప్రవక్త మహనీయుల (స) వారి మాటననుసరించి – నింగికి నిచ్చెన వేసి, అది సరిగా ఆనిందో లేదో చూసుకోకుండా గబగబా మెట్టేక్కే కొంత మంది తల్లిదండ్రులు అమిత వాత్సల్యం కనబర్చాలన్న కుతుహలంతో మాత్సర్యానికి పాల్పడుతుంటారు. అటువంటి కుటుంబ నేపథ్యం లో పెరిగిన పిల్లలకు సత్యం ఇదని ఎంత నచ్చజెప్పడానికి ప్రయ త్నించినా వారు దాన్ని అంగీకరించరు. పైగా తామున్న స్థితికన్నా మేలైన స్థితి మరొకటి ఉండగలదన్నది వారు కలలో కూడా కల గనని విషయం. మనిషి ఈ స్వభావాన్ని గురించి తెలియజేస్తూ అంతిమ దైవ గ్రంథం ఖుర్ఆన్ ఇలా అంటుంది:

'అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని (సత్యాన్ని) అనుసరిం చండి' అని వారికి చెప్పినప్పుడల్లా – 'మా తల్లిదండ్రులు అవలంబిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము పాటిస్తాము' అని వారు సమాధానమిస్తారు. వారి పూర్వీకులు ఒట్టి అవివేకులు, మార్గవీహీనులైనప్పటికీ (వీళ్ళు వారినే అనుసరిస్తారన్న మాట!)

(అల్ బఖర: 170)

అంటే మనిషి తనలోని విశ్వాసం, విధేయత అనే అంతరంగిక భావనకు కట్టుబడి, తాను దేన్నయినా పెద్దదిగా, పవిత్రమయినది గా విశ్వసించి దాని ముందు **బేషరతుగా** లొంగిపోవాలని కాంక్షిస్తాడు. ఈ మనోమయ స్థితిని అతను రెండు విధాలుగా ప్రక టిస్తాడు. ఒకటి–**ఏకేశ్వరోపాశన (తౌహీద్)**, రెండు–**బహు దైవారా ధన (షిర్క్).**

మనిషి గనక ఒకే నిజ దైవాన్ని విశ్వసించి, ఆయన పంపిన ప్రవక్తల్ని, అవతరింపజేసిన గ్రంథాల్ని యథాతథంగా అనుస రించి, ఆయనకు మాత్రమే తన ఉపాసనారీతులన్నింటిని అంకి తం చేసినట్లయితే అతను అంతరంగికంగా ఉన్న ఆ భావనకు సరైన స్థానం ఇచ్చాడన్న మాట. ఆత్మ విశ్వాసంతో వ్యవహరించా డన్న మాట.

అయితే మనిషి సాధారణంగా తనకు ఉన్నతంగా కనిపించిన దాన్నల్లా అభిమానంతోనో, భయంతోనో దండం పెడతాడు. దాని దాస్యంలో లీనమయిపోతాడు. ఈ ప్రక్రియ రెండు విధాలుగా సాగుతుంది. ఒకటి–ప్రకృతి వస్తువులను పవిత్రంగా విశ్వసించ డం (హర్ కంకర్ శంకర్‌లా అన్న మాట). రెండు – మానవుల్లో ఎవరినయినా పవిత్రంగా భావించి విశ్వసించడం. వారి ఆదేశాల ను, తీర్పులను దైవాదేశాలు, తీర్పులకన్నా అధికంగా భావించడం. ఈ రెండు అపసవ్యతలు, అపనమ్మకాలు ప్రాచీన కాలం నాటి నుండి నేటి వరకూ ఎప్పుడూ ఏదోక స్థాయిలో–ఏదోక రూపంలో ఉన్నట్లు మనం గమనిస్తాం. ఈ చారిత్రక వాస్తవాన్ని తెలియజేస్తూ నిజప్రభువు అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

'ఉజైర్ అల్లాహ్ కుమారుడు' అని యూదులంటారు. **'మసీహ్ (ఏసు క్రీస్తు) అల్లాహ్ కుమారుడు'** అని నసారా (క్రైస్తవులు) అంటున్నారు. ఇవి వారి నోటి మాటలు మాత్రమే. పూర్వం అవి శ్వాసులు చెప్పిన మాటలనే వీళ్ళూ అనుకరిస్తున్నారు. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక! (సత్యం నుండి) వారెలా తిరిగి పోతున్నారు? వారు అల్లాహ్‌ను వదలి తమ పండితులను, సన్యా సులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. మర్యమ్ కుమారుడగు మసీహ్‌ను కూడా. నిజానికి వారందరికి, అద్వితీయుడై అల్లాహ్ ను మాత్రమే ఆరాధించవలసిందిగా ఆజ్ఞాపించబడింది. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. వారు నిర్ధారించుకుంటున్న భాగస్వామ్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు'.

(తౌబా: 30, 31)

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆగమనానికి పూర్వం వరకు – భారత దేశంతోపాటు, అరబ్బు, గ్రీకు, ఈజిప్టు, రోమ్, ఇరాన్ సంస్కృతులు–ఇంకా ప్రాచీన సంస్కృతులన్నీ దాదాపు బహుదైవారాధన, విగ్రహారాధన, మూఢనమ్మకాల సంస్కృతులు గానే ఉండేవి. భూమి, ఆకాశము, గాలి, నీరు, నిప్పు, సూర్య చంద్రనక్షత్రాలు మానవుని కొరకు పూజనీయమయినవిగా మారి ఉండేవి. ఈ మూఢవిశ్వాసాల మూలంగా ఆయా జాతులలో మానసిక స్తబ్ధత, భావ దారిద్ర్యం ఆవరించి ఉండేది.

May .indd 2 5/5/12 2:00 PM

మనిషి తాను పవిత్రంగా భావించిన వాటి పట్ల భయభక్తుల భావనను ఏర్పరచుకున్నాడు. సృష్టిశ్రేష్ఠుడయి ఉండి కూడా అల్పాతి అల్పమయిన జీవరాసుల ముందు తనను, అశక్తునిగా, అల్పునిగా ఊహించుకున్నాడు. తన సత్యాన్వేషణ ఆఖరి హద్దు ఇదేనని తలపోశాడు. రాళ్ళు, రప్పలు, పశువులు, పాములు, చక్రవర్తులు, మతాధిపతులు, కుల పెద్దలు, జాతి నాయకులు మొదలయిన వారిని పూజించడం ప్రారంభించాడు. వాటి పేర ముడుపులు చెల్లించడం, వినే, కనే, చేసే, కదిలే శక్తి లేని వాటిని ప్రసన్నం చేసుకునేందుకు నవీన పద్ధతుల్ని ప్రవేశ పెట్టాడు. వాటి ఆగ్రహాన్ని చల్లార్చేందుకు పశువులను, చివరకు సొంత సంతానాన్ని బలిచ్చే స్థాయికి తన్ను తాను దిగజార్చుకున్నాడు. మనిషిని బుద్ధివివేకాల్ని, విచక్షణా జ్ఞానాన్నిచ్చి దేవుడు పుట్టిస్తే, మనిషేమో, తెలివిహీనంగా, మూర్ఖుడిగా మారి వాస్తవాన్ని విస్మరించి, ఊహా జగత్తులో ఊయలూగడాన్నే ఇష్టపడ్డాడు.

పవిత్రం అనబడే ఈ విశ్వాసం తాత్కాలికమో, కాల్పనికమో కాదు. అది మానవ నైజంలో ఆఖరి అంచుదాక, అణువణువునా పెనవేసుకుని ఉంటుంది. దాన్ని ఉపయోగించుకునే సరైన పద్ధతి ఏమిటంటే, మనిషి తన మనో భావాలను ఒకే నిజ దైవం కొరకు మాత్రమే ప్రత్యేకించాలి. అయితే ఏ పవిత్ర భావనైతే సృష్టికర్త వైపు మరలాలో అది సత్యకాంతి సన్నగిల్లినప్పుడల్లా సృష్టితాల వైపు మరలుతుంది. ఈ కారణంగానే నిజమైన దేవుడు ఆకాశాలలో అర్ష్ మీద ఆసీనుడయి ఉన్నాడని విశ్వసిస్తూనే తన పరిసర ప్రాంతాల్లో తనకు నచ్చిన వాటిని ఆయన ప్రతక్ష్య రూపాలుగా భావించనాభిస్తాడు. అవి, సర్వ శక్తిమంతుడయిన అల్లాహ్ ఆజ్ఞకు లోబడి ఉంటాయని నమ్ముతాడు. అందుకే ముగ్గురు, ముక్కోటి అనేవారు సయితం దేవుడు ఒక్కడే అన్న అంతిమ సత్యానికి కట్టుబడి ఉన్నట్లు మనం చూస్తాము. కాబట్టి అందరి ప్రభువైన అల్లాహ్ మనందరి మధ్య సమాంతర విషయమైన ఆ పరమ సత్యం వైపునకు మనల్ని ఎంతో ప్రేమగా ఆహ్వానిస్తున్నాడు:

(ఓ ప్రవక్తా! వారికి స్పష్టంగా చెప్పు): "ఓ గ్రంథవహులారా! మాలోనూ, మీలోనూ సమానంగా ఉన్న ఒక విషయం వైపునకు రండి. అదేమంటే మనం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించ రాదు. అల్లాహ్‌ను వదలి మనలో ఎవరూ ఇంకొరిని ప్రభువులుగా చేసుకోరాదు". (ఆలి ఇమ్రాన్: 64)

ఈ లోకం ధనవ్యామోహపరమైందన్న మాట నిజం. ఇక్కడ వస్తులే కాదు, మనసులూ, మానాలూ, భావాలూ, విశ్వాసాలూ, చివరకు అంతరాత్మలు కూడా అమ్ముడుపోతున్నప్పుడు మనిషి ధర్మం అమ్ముడుపోవడంలో ఆశ్చర్యం ఏముంది చెప్పండి. నేటి మన సమాజంలో ధనాన్ని నిలబెట్టుకోవడం కన్నా, ధర్మాన్ని కాపాడుకోవడం చాలా కష్టం. దానికి ఎంతో విజ్ఞానమూ, వివేకమూ, ఆత్మవిశ్వాసమూ, మనోస్థయిర్యమూ, గుండె ధైర్యమూ అవసరం. ఎందుకంటే–,

ఆత్మ విశ్వాసం ఉన్న అసంపూర్ణ సంస్కారాలు, నాగరికతలు, సిద్ధాంతాలు–ఆత్మవిశ్వాసం కోల్పోయిన సంపూర్ణ సంస్కారాలను, సిద్ధాంతాలను, నాగరికతలను జయిస్తాయి. అక్కడ ఓడి పోయేది సిద్ధాంతాలో, సంస్కారాలో కాదు; ఆయా సిద్ధాంతాల పట్ల ఆత్మ విశ్వాం, దృఢనమ్మకం కొరవడిన ప్రజలు. గెలిచేదీ సిద్ధాంతాలో, సంస్కారాలో కాదు; నూలుపోగుకన్నా బలహీనమైన ఆ సిద్ధాంతాల పట్ల దృఢ నమ్మకం, ఆత్మవిశ్వాసం గల ప్రజలే. ఇది గుర్తించని కొందరు వ్యక్తికీ, వ్యవస్థకీ ఉండే సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోగా, వ్యక్తి లోపాల్ని వ్యవస్థ లోపాలుగా ఎంచుతూ కనబడతారు.

మనకన్నా మంచి సంస్కారం గలవారి సహచర్యం వల్ల మన సంస్కార స్థాయి పెరిగి, ఆత్మ విశ్వాసం, మనో వికాసం, ఆత్మ బలం చేకూరుతుంది. అలా కాక చెడు సంస్కారం గల వాళ్ళ సావాసంగానీ, వారిని సహించడంగాని మొదలు పెడితే మన సంస్కార స్థాయి తగ్గి, ఆత్మ విశ్వాసం సన్నగిల్లి, మనో వికాసం అధమ స్థాయిలో ప్రథమ స్థానానికి చేరే ప్రమాదం ఉంటుంది. **'నీచ మైన పనులు చెయ్యవు, ఘనమైన పనులు చెయ్యలేవు'** అన్నట్టు జీవితాన్ని గమనించడమే చాతనయి, దాన్ని మార్చడం ఏ మాత్రం చాతకానట్టు ప్రవర్తించకూడదు; ప్రవర్తించే వారిని సహించ కూడదు. ప్రజల్లో మంచి మీద, సంస్కారం మీద అభిమానం ఉన్న వారు, దారిద్ర్యం–భావదారిద్ర్యం పట్ల ఉపేక్ష వహిస్తే ఆ చెడు చీడగా మారి సంస్కారాల్ని, సంసారాల్ని, సత్కార్యాల్ని నిలువునా నిప్పు కుంపటిలోకి నెట్టేస్తుంది.

నేను మారాను, బాగున్నాను కాబట్టి సమాజాలు, దేశాలు మారిపోవాలి, బాగు పడాలి అనుకోవడంలో తప్పు లేదు కానీ, అందరికీ బుద్ధి చెప్పాలనుకునే మనం ఒక్కణ్ణయినా మార్చగలిగామా? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. సమాజం గురించి, సమాజాన్ని సంస్కరించే సిద్ధాంతాల గురించి తెలియడం, తెలియకపోవడం అటుంచి, గౌరవప్రదమైన పద్ధతితో, ధర్మసమ్మతమైన రీతిలో సంపాదించి, స్వయాన్ని, సంసారాన్ని పోషించడంతోపాటు కనీసం నలుగురికి నాలుగు విధాలుగా ఉపయోగపడేటట్టు ఉండాలి. ఇతరులను బాగు చెయ్యకపోవడం మన అసమర్థత అయి ఉండాలేగానీ, బాగు చెయ్యడం అసాధ్యమైంది మాత్రం కాదు. ఒకడు చేస్తున్నది తప్పు అని మన అంతరాత్మకు తొస్తున్నప్పుడు, శక్తి ద్వారా నియంత్రించక, ఉక్తి ద్వారా ఖండిచక, మౌనం ద్వారా నిరసించలేకున్న మనలోని విశ్వాసం ఏ పాటిదో యోచించాలి. మన తప్పులు ఎవరో దిద్దకపోయినట్లయితే మనం ఏ స్థితిలో ఉండేవాళ్ళమో ఆలోచించాలి. కాబట్టి –

ఉక్కు సంకెళ్ళతో బంధించబడి, నానారకాల చిత్రహింసలకు గురి చేయబడుతున్న వాడు ఎంతగానయితే స్వాతంత్ర తీవ్ర కాంక్షకు లోబడి బంధ విముక్తుడు కావడానికి ప్రయత్నించడంలో ఎంత వేదనా, ఎంత బాధ భరిస్తూ పరితపించిపోతాడో, మనం సయితం మార్గం తప్పి, అగమ్యగోచరంగా ఉన్న సాటి మనుషులు పట్ల అంతగానే పరితపించి పోవాలి. మానవాళిని ఎలాగయినా సరే నరకాగ్ని నుండి కాపాడి, స్వర్గధామానికి అర్హుల్ని చేసేందుకు శక్తి వంచన లేకుండా అవిశ్రాంతంగా పరిశ్రమించాలి. ఈ కార్య సిద్ధిలో అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స)వారు, ఆయనకు పూర్వం గతించిన ప్రవక్తల జీవితాలు మనకాదర్శం అవ్వాలి. అలా మనం చేసిననాడు మాధవుడు మనకిచ్చే శుభవార్త ఎలా ఉంటుందంటే, **"మా ప్రభువు అల్లాహ్ మాత్రమే"** అని పలికి దానిపై స్థిరంగా ఉన్న వారి వద్దకు దైవ దూతలు దిగి వచ్చి (ఇలా అంటూ ఉంటారు): **'మీరు భయపడకండి, దుఃఖించకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గధామ శుభవార్తను అందుకోండి. ప్రాపంచిక జీవితంలో కూడా మేము మీకు నేస్తాలుగా ఉంటూ వచ్చాము. పరలోకంలో కూడా ఉంటాము. మీ మనసులు కోరుకున్నవన్నీ, మీరు అడిగినవన్నీ అక్కడ మీ కోసం సమకూర్చబడి ఉంటాయి. క్షమాశీలి, దయాకరుని (అల్లాహ్) తరఫు నుండి లభించే ఆతిథ్యం ఇది.**

అల్లాహ్ వైపు (జనులను) పిలుస్తూ, సత్కార్యాలు చేస్తూ, 'నిశ్చయంగా నేను ముస్లింల (విధేయుల)లోని వాడను' అని (ఆత్మ విశ్వాసంతో) పలికే వాని మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు?". (దివ్యఖుర్ఆన్–41: 30–33)

May .indd 3 5/5/12 2:01 PM

ఉర్దూ సంకలనం
ముహమ్మద్ అన్వర్ సలఫీ

వడ్డీ మానత్వాన్ని మంటగలిపే ఓ సామాజిక మహాపరాధం. ఇది దురదుష్టవశాత్తు మానవ సమాజాలన్నింటిలోనూ క్యాన్సర్‌లా వ్యాప్తి చెందింది. ఏ ఒక్క వ్యాపారం, ఏ ఒక్క బ్యాంకు కూడా దీని ప్రభావం నుండి బహుశా సురక్షితంగా లేదేమో! ఈ పాపం ఎంతగా వ్యాప్తి చెందిందంటే దాన్ని నిషేధంగా పాపంగా భావించే వారిని లోకం నేరస్తులుగా చూస్తున్నది. నిజానికి ఇది ప్రళయం సమీపించిందనటానికి ఓ ఆనవాలు. అలాగే జాతులు, రాజ్యాల వినాశానికి కూడా ఇది ఒక సంకేతం. వినాశకరమైన ఈ పాపం గురించి పాఠకులకు కొన్ని ఇస్లామీయ ఆదేశాలు తెలియపరుస్తున్నాం. బహుశా దీని ద్వారా వడ్డీ శాపానికి గురై ఉన్న సోదరులకు పశ్చాత్తాపం(తౌబా)చెందే సద్బుద్ధి లభిస్తుందని ఆశిస్తున్నాము.

వడ్డీ నిర్వచనం: వడ్డీని అరబీలో **'రిబా'** అంటారు. నిఘంటువు ప్రకారం దీనికి వృద్ధి, అధికం, అదనం అనే అర్థాలొస్తాయి. షరీఅత్ పరిభాషలో **'రిబా'** నిర్వచనం పలు విధాలుగా చేయడం జరిగింది. ఇమామ్ అబ్దుల్ ఖాదిర్ జుర్‌జానీ గారు రిబా గురించి ఇలా వివరించారు: "ఏదైనా ఒక వస్తువుకు బదులు ఒక వర్గం మరో వర్గంపై షరతుగా విధించే ప్రతి ఎక్కువ సొమ్ముని రిబా అని అంటారు. (అత్తారీఫాత్ లిల్ జుర్‌జానీ:114)

ఒక వర్గానికి అసలు ధనంపైన లాభాన్నిచ్చే ప్రతి రుణాన్ని రిబా అంటారు.(కషాఫ్ ఇస్తిలాహాతుల్ ఫునూన్)

భారత ఉపఖండంలో పేరు పొందిన పండితులు మౌలానా అబ్దుల్ మన్నాన్ నూర్‌పూరీ వడ్డీ గురించి వివరిస్తూ ఇలా అన్నారు: ప్రజా బాహుళ్యంలో వడ్డీగా ప్రసిద్ధి చెందిన ప్రతి సొమ్మూ వడ్డీ అవుతుంది. అది వ్యక్తిగతమైనదైనా, సమాజ పరమైనదైనా, వ్యాపారానికి సంబంధించినదైనా, బ్యాంకులకు సంబంధించినదైనా, ఇన్సూరెన్స్‌కు సంబంధించినదైనా, కంపెనీలకు సంబంధించినదైనా, ముస్లిం రాజ్యంలోనయినా, ముస్లిం దేశం కాకపోయినా, ముస్లింల తరపునైనా, ముస్లిమేతరుల తరపునైనా జిమ్మీల తరపునైనా, హర్‌బీల తరపునైనా, ఆకాశం క్రింద భూమిపైన ఏ భాగంలోనయినా జన బాహుళ్యంలో వడ్డీ అనబడే ప్రతి వస్తువుని వడ్డీ అంటారు.

(ఇస్తిఫాదహ్ అజ్ మఖాలాత్ నూర్‌పూరీ:64)

వడ్డీ నిషేధాజ్ఞ: అరబ్బులలో వడ్డీ రివాజు సర్వసామాన్యంగా ఉండేది. వ్యాపారంలోనూ, ఇతర ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాల లోనూ వడ్డీ చాలా రకాలుగా వ్యాపించిపోయి ఉండేది. అప్పటికి మక్కాలో ఇస్లామీయ వ్యవస్థ పూర్తిగా స్థాపించబడలేదు. అందు చేత ఇస్లాం యొక్క ఎక్కువ ఆజ్ఞలు మదీనాలో అవతరించాయి. మదీనాలో ఇస్లామీయ సమాజం సలక్షణంగా స్థాపించబడి ఉంది. అందువల్ల దైవప్రవక్త (స) యొక్క మదనీ జీవితపు మొదటి రోజులలోనే అల్లాహ్ వడ్డీని నిషేధించాడు: "ఓ విశ్వసించిన వారలారా! అల్లాహ్‌కు భయపడండి. **మీరు నికార్సయిన విశ్వాసులే అయినట్లయితే మిగిలి వున్న వడ్డీని విడిచి పెట్టండి. ఒకవేళ మీరు గనక అలా చేయనట్లయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధంకండి.** ఒకవేళ మీరు పశ్చాత్తాపం చెందితే మీ అసలు సొమ్ము మీకే ఉంటుంది. మీరూ ఒకరికి అన్యాయం చేయకూడదు. మీకు కూడా అన్యాయం జరుగకూడదు. ఒకవేళ రుణగ్రస్తుడు యిబ్బందుల్లో ఉంటే అతని పరిస్థితి మెరుగుపడేవరకూ అతనికి గడువు ఇవ్వాలి. లేదా మన్నించి దానంగా వదలి పెట్టండి. మీరే గనక తెలుసుకోగలిగితే ఇది మీ కొరకు శ్రేయోదాయకం.

(అల్ బఖర:278-280)

"ఓ విశ్వసించిన వారలారా! ద్విగుణీకృతం, బహుగుణీకృతం చేసి వడ్డీని తినకండి. మీరు సాఫల్యం పొందటానికిగాను అల్లాహ్‌కు భయపడండి. అవిశ్వాసుల కొరకు సిద్ధం చేయబడిన నరకాగ్నికి భయపడండి. అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి-తద్వారా మీరు కనికరించబడే అవకాశం ఉంది".

(ఆలి ఇమ్రాన్:130-132)

హజ్జతుల్ వదా సందర్భంగా అరేబియా నలుమూలల నుంచి సహాబాలు తరలి వచ్చారు. అటువంటి సమయంలో దైవప్రవక్త (స) మారు వడ్డీ మరియు వ్యాపారపరమైన వడ్డీ నిషేధాన్ని ప్రకటించారు: "వినండి! అజ్ఞాన కాలం నాటి ప్రతి వస్తువు నా కాళ్ళ క్రింద నలిపివేయబడింది. అజ్ఞానకాలంనాటి రక్తాలు కూడా రూపుమాపబడ్డాయి. ఇక మా రక్తాలలో నుంచి నేను తుడిచివేస్తున్న మొదటి రక్తం రబీఅ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గారి కుమారునిది. ఈ పసివాడు బనీ సఅద్‌లో పాలు త్రాగే సమయంలో హుజైల్ తెగకు చెందినవారు (కొందరు) అతనిని చంపేశారు. మరి అజ్ఞాన కాలం నాటి వడ్డీ కూడా తుడిచివేయబడింది. మా వడ్డీలలో నుంచి నేను తుడిచి వేస్తున్న మొదటి వడ్డీ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌ది.(బుఖారీ)

హదీసులలో వడ్డీ ఖండన: హజ్రత్ అబూహురైరా(ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఏడు ప్రాణాంతక వస్తువుల బారి నుండి మిమ్మల్ని కాపాడుకోండి. అవి ఏమిటని ప్రశ్నించగా ఆయన(స) ఇలా తెలియజేశారు: 1) ఒక్కడైన అల్లాహ్‌కు సహవర్తులుగా వేరొక దైవాన్ని నిలబెట్టడం. 2) చేతబడి చేయడం, చేయించడం. 3) అన్యాయంగా హత్య చేయటం. 4) అనాథల సొమ్ము అన్యాయంగా తినటం. 5) వడ్డీ తినటం. 6) ధర్మయుద్ధ సమయంలో యుద్ధరంగం నుండి వెన్ను చూపి పారిపోవటం. 7- పాపం ఎరుగని సౌశీల్యవతి అయిన మహిళపై అపనింద మోపడం. (బుఖారి:2766, ముస్లిం:89)

May .indd 4 5/5/12 2:01 PM

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హన్‌జల(ర) (ఈయన తండ్రి హన్‌జల బిన్ ఆమిర్‌ని ఉహద్ పోరాటంలో దైవదూతలు స్నానం చేయించారు) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: **"తెలిసి కూడా వడ్డీలోని ఒక్క దిర్‌హమ్ తిన్నవాడు 36 సార్లు వ్యభిచారం చేసినదానికన్నా ఎక్కువ పాపం చేసినట్లు లెక్క".**

(ముస్నద్ అహ్‌మద్, తబ్రాని)

దైవప్రవక్త(స) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (ర) ఉల్లేఖించారు: "వడ్డీలో డెబ్బయి మూడు స్థాయిలున్నాయి. వాటిలో అత్యంత హీనమైన స్థాయి (దశ) యొక్క పాపం ఒక వ్యక్తి తన కన్నతల్లిని పెళ్ళాడటం వంటిది. వడ్డీ యొక్క అత్యంత తీవ్రస్థాయి పాపం ఒక ముస్లిం పరువు ప్రతిష్ఠలను మంట గలపటం వంటిది. (హాకిం, బైహఖీ)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(ర) కథనం: దైవప్రవక్త (స) "వడ్డీ తీసుకునే వారినీ, ఇచ్చే వారినీ, దీనికి సాక్షులుగా ఉండే వారినీ ధూత్కరించారు". ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: "ఈ పాపాన్ని మూట కట్టుకోవటంలో వీరంతా సమానులే".

(ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా తెలియజేసారు: "ఏ ఊరిలోనైతే వ్యభిచారం మరియు వడ్డీ రివాజుగా మారిపోతుందో అక్కడి నివాసులు తమపైన దైవ శిక్షను హలాల్ చేసుకున్నట్లు".

(ముస్తద్‌రక్ లిల్ హాకిం)

వడ్డీ పెరగదు, తరుగుతుంది: వడ్డీ పెరుగుతుందని భావించడం ఒక భ్రమ మాత్రమే. అల్లాహ్ మరియు దైవప్రవక్త (స) వడ్డీ తరుగుతుందని అది నాశనానికి కారణమని తెలియజేశారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **'అల్లాహ్ వడ్డీని హరింపజేస్తాడు, దానధర్మాలను పెంచుతాడు. మేలును మరిచేవారిని, పాపిష్టులను అల్లాహ్ సుతరామూ ప్రేమించడు. విశ్వసించి (సున్నత్ ప్రకారం) సత్కార్యాలు చేసేవారికి, నమాజులను నెలకొల్పేవారికి, జకాత్‌ను చెల్లించేవారికి తమ ప్రభువు వద్ద పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, చీకూ చింతగానీ ఉండవు'.** (అల్ బఖర:276-277)

'యమ్‌హఖుల్లాహుర్రిబా' అనే వాక్యానికి వివరణ ఇస్తూ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ఇలా అన్నారు: ముహిఖ్ అంటే తరగటం. అది ఎలా జరుగుతుందంటే అల్లాహ్ వడ్డీ తినేవాని హజ్, దానధర్మాలు, జిహాద్, బంధుత్వాలను పెంపొందించటం లాంటి పుణ్యాలు స్వీకరించడు. అనగా అతని ఏ ఒక్క సత్కార్యం స్వీకరించబడదు. (తఫ్‌సీర్ ఖుర్‌తుబీ: 2/234)

అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా తెలియజేశారు: **"ఏవ్యక్తి అయితే వడ్డీ ద్వారా ఎక్కువ ధనం సంపాదించాడో చివరకు దాని ఫలితం నశించటమే అవుతుంది".** (ఇబ్నెమాజ)

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: వడ్డీ చూడటానికి ఎక్కువగా కనిపించినా చివరకు అది నశిస్తుంది.

(ముస్తద్‌రక్ హాకిం)

ఐహికలాలస గల మనిషి వడ్డీతో ధనం పెరుగుతుందనీ, జకాత్‌తో ధనం తరుగుతుందనీ భావిస్తాడు. ఇది వాస్తవానికి విరుద్ధం. ఇలాంటి ధనపూజారుల మార్గదర్శకం కోసం వడ్డీకి బదులుగా అల్లాహ్ జకాత్ మరియు దానధర్మాలను పెట్టి వీటి ద్వారానే ధనం పెరుగుతుందని తెలియజేశాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ప్రజల సొమ్ములలో చేరి వృద్ధి చెందుతున్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో ఎంతమాత్రం వృద్ధి చెందదు. అయితే అల్లాహ్ ప్రసన్నతను చూరగొనేందుకు మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే-అలాంటివారే (తమ సంపదలను) ఎన్నో రెట్లు వృద్ధిపరచుకున్న వారవుతారు".** (అర్ రూమ్:39)

వడ్డీ తినేవారి పరిస్థితి: ప్రళయ దినాన వడ్డీ తినేవారు ఒక ప్రత్యేక స్థితిలో ఉంటారు వీరు ప్రపంచంలో ఉన్నప్పుడు వడ్డీ తింటూ ఉండేవారని చూసేవారు గ్రహిస్తారు. (ఇలాంటి వారి గురించి) అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "వడ్డీ సొమ్ము తినేవారు షైతాను పట్టటం వల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతారు. వారికీ దుర్గతి పట్టడానికి కారణం **"వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!"** అని వారు అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు. కనుక ఎవరు తన ప్రభువు వద్ద నుంచి వచ్చిన హితబోధను విని వడ్డీ ని మానుకున్నాడో, అతడు గతంలో పుచ్చుకున్నదేదో పుచ్చుకు న్నాడు. అతని వ్యవహారం దైవాధీనం. **ఇకమీదట కూడా దీనికి పాల్పడినవారే నరకవాసులు. వారు కలకాలం అందులో పడి ఉంటారు".** (అల్ బఖర:275)

హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (ర)కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "(పశ్చాత్తాపంతో తప్పు) క్షమించబడని పాపాల నుండి మీరు మిమ్మల్ని కాపాడుకోండి. 1) **ద్రోహం:** ఏదైనా విషయంలో ద్రోహం చేసిన వ్యక్తి అతను ద్రోహం చేసిన వస్తువుతో ప్రళయ దినాన లేపబడతాడు. 2) వడ్డీ తినటం: వడ్డీ తినేవాడు ప్రళయ దినాన పిచ్చివాడిలా ఊగుతూ లేపబడతాడు. తరువాత దైవ ప్రవక్త(స) ఈ వాక్యాన్ని పఠించారు: 'వడ్డీ సొమ్ము తినేవారు షైతాను పట్టటంవల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతాడు".

(తర్‌గీబ్ వ తర్‌హీబ్)

వడ్డీ ఎంత తీవ్రమైన పాపమంటే ఇది సమాధిలో శిక్షకు కారణభూతమవుతుంది. ప్రళయ దినాన కూడా శిక్షకు గురి చేస్తుంది. హజ్రత్ సమురా బిన్ జున్‌దుబ్(ర) దైవ ప్రవక్త(స) చెప్పారని అన్నారు: "రాత్రి నా వద్దకు ఇద్దరు దైవదూతలు (జిబ్రయీల్, మీకాయీల్) వచ్చారు, వీరు నన్ను ఎత్తుకుని ఒక పవిత్ర స్థలం వైపునకు తీసుకెళ్ళారు, అక్కడ దైవప్రవక్త(స) ఎన్నో విషయాలను చూశారు, వీటిలో ఒకటి ఒక రక్తపుటేరు కనిపించింది, అందులో ఒక మనిషి ఈదుతున్నాడు, నది ఒడ్డున ఒక మనిషి నుంచుని ఉన్నాడు. అతని దగ్గర ఎన్నో రాళ్ళున్నాయి, నదిలో ఉన్న వ్యక్తి బయటకు రావటానికి ప్రయత్నించినప్పుడు ఒడ్డున ఉన్న వ్యక్తి అతని ముఖంపై రాయి రువ్వుతున్నాడు, దాంతో అతను మళ్ళీ నది మధ్యలో వెళ్ళిపోతున్నాడు, అతను మళ్ళీ బయట పడేందుకు ప్రయత్నించగా ఒడ్డున ఉన్న మనిషి మళ్ళీ రాయి అతని ముఖంపై రువ్వుతున్నాడు, అతను మళ్ళీ నది మధ్యలోకి వెళ్ళిపోతున్నాడు. ఈ విధంగా జరుగుతూనే ఉంది. ఇంతకీ ఏమిటి ఇది? అని నేను నా వెంట ఉన్న ఇద్దరిని ప్రశ్నించగా **'ఏరులో చిక్కుకుపోయిన వ్యక్తి వడ్డీ సొమ్ము తినేవాడు. అందువల్ల తన కర్మకుగాను శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ శిక్ష ప్రళయం వరకూ అనుభవిస్తూనే ఉంటాడు'** అని వారు జవాబు చెప్పారు". (బుఖారి)

(ఇంకా ఉంది)

May .indd 5 5/5/12 2:01 PM

కువైట్ ఆకర్షణా కేంద్రాలు

షేక్ యజ్దానీ

జలక్రీడ పార్కు (Aqua park)

కువైట్‌లో జలక్రీడల పార్కు 1955 సంవత్సరంలో ప్రారంభించబడినది. ఇది గల్ఫ్ ప్రాంతంలోనే మొదటిది, మరియు వైశాల్యంలో చాలా పెద్ద జలక్రీడా పార్కు. దీని వైశాల్యము 60,000 చదరపు మీటర్లు. ఈ జలక్రీడా పార్కు గల్ఫ్ స్ట్రీట్‌లో కువైట్ టవర్స్ ప్రక్కన నెలకొని ఉన్నది. ఈ పార్కులోని పిల్లలకు మరియు పెద్దలకు అనుగుణంగా వివిధ రకాల జలక్రీడలు, ఈత కొలనులు (స్విమ్మింగ్ పూల్స్) డైనింగ్ సాధన కొరకు డైనింగ్ క్లబ్‌లు, ఇసుకలో వాలీబాల్ క్రీడలు మరియు ఎన్నో ఉల్లాస భరితమైన క్రీడలు ఏర్పాటు చేయబడినాయి.

స్థలము: కువైట్ టవర్స్ ప్రక్కన.
సంప్రదించు కొరకు: 22431960/1/3
వెబ్‌సైట్: aquaparkkuwait.com

ఓడ రేవు (Seaport)

సముద్ర వ్యాపారం, చేపల వేట, మరియు ముత్యాల అన్వేషణ కొరకు పురాతన కాలంలో ఉపయోగించబడిన నౌకలు మరియు ఓడలు ఇక్కడ సందర్శకులకు దర్శనమిస్తాయి. ముఖ్యంగా ఫతే అల్‌ఖైర్ అనబడు పురాతన నౌకను దర్శించవచ్చు. ఈ నౌక చివరిసారిగా ఉపయోగించిన అతి పెద్ద కలప నౌక. (ఊడన్ దౌ) ఇక్కడ డీజల్ పెట్రోల్ లభించక ముందు కాలం నాటిది.

స్థలము: కువైట్ సైంటిఫిక్ సెంటర్ వెనుక ప్రాంతము.
సంప్రదించు కొరకు: 1848888.

డిక్సన్ నివాసము (డిక్సన్ హౌస్)

ఇది కువైట్‌లో మొదటి బ్రిటిష్ రాజకీయ ప్రతినిధి యొక్క నివాస కేంద్రము. ఈ నివాసము 1870లో కువైట్ వ్యాపారవేత్త నిర్మించడం జరిగినది. తరువాత 1923లో బ్రిటిష్ రాజకీయ ప్రతినిధి డిక్సన్ తన నివాసము ఇందులోకి మార్చడము జరిగినది.

కువైట్ ఆక్రమణ తరువాత **'ది కువైట్ నేషనల్ కౌన్సిల్.....'** సంస్థ ఈ నివాసమును పునర్మించి సందర్శకుల కొరకు తెరవడము జరిగింది. ఈ భవనము 19వ శతాబ్దపు కువైట్ నిర్మాణాలకు నిదర్శనము.

స్థలము: సీఫ్ పాలెస్ (సీఫ్ పాలెస్) తూర్పు ప్రక్కన.

ఓడ నిర్మాణ కేంద్రము (డవౌ విల్లేజ్)

ఈ ఓడ నిర్మాణ కేంద్రము కువైట్‌లో పురాతన కాలంలో నౌకలు/ ఓడలకు నిర్మాణ కేంద్రము. ఈ ఓడ నిర్మాణ కేంద్రం సందర్శించనపుడు కువైట్ యొక్క చరిత్ర గుర్తుకు తెస్తుంది. ఇక్కడ ముఖ్యంగా ఓడ నిర్మాణ కేంద్రాలు మరియు లఘు నౌకా ఆకారాలు ముఖ్యమైన ఆకర్షణలు.

కువైట్ కాలక్షేప నగరము (కువైట్ ఎంటర్ టైన్‌మెంట్ సిటి)

కువైట్ ఎంటర్‌టైన్‌మెంట్ సిటి కువైట్ యొక్క డిస్నిలాండ్ (డిస్ని లాండ్). ఈ ఎంటర్‌టైన్‌మెంట్ సిటి కువైట్ నుంచి 20 కి.మీ దూరములో ఏర్పాటు చేయబడినది.

May .indd 6 5/5/12 2:01 PM

ఇక్కడ కుటుంబములోని అన్ని వయసుల వారికి అనుగుణంగా వివిధ రకాలైన కాల క్షేప కేంద్రాలు ఏర్పాటు చేయబడినవి. ఇక్కడ గడపడము వేరే క్రొత్త ప్రపంచంలో విహరిస్తున్నట్లు అనుభూతినిస్తుంది.

స్థలము: దోహ ప్రాంతము (కువైట్ నగరము నుంచి 20 కి.మీ.

పని చేయు వేళలు: సాయంత్రం 5 నుంచి రాత్రి 1 వరకు – వేసవికాలము. సాయంత్రం 3 నుంచి నుంచి రాత్రి 11 వరకు – శీతాకాలము.

ప్రవేశ రుసుము: 3.50 దీనార్ ప్రతి మనిషికి.

సంప్రదించుటకు: 24879455.

ఫైలకా పారంపర్య గ్రామము (ఫైలకా హెరిటేజ్ విల్లేజ్)

ఫైలకా గ్రామములో కువైట్ యొక్క పురాతన చిహ్నాలను సురక్షితము చేయబడి ఉన్నవి. ఈ గ్రామంలో ప్రవేశించన వెంటనే మీరు పురాతన కాలంలో సమయం గడిపిన అనుభూతి కలిగిస్తుంది.

ఇక్కడ ఏర్పాటు చేయబడిన విశ్రాంతి గృహాలు విశాలంగా, అన్ని వసతులలో ఆహ్లాదకరమైన వాతావరణము కలిగిస్తాయి. ఇక్కడ అరేబియన్ గుర్రపు స్వారి, ఒంటె స్వారీలు మరియు బార్చిక్కు (బార్ బేక్యూస్) రాత్రి వెన్నలలో ముఖ్యమైన కాలక్షేపాలు.

ఇక్కడ ఆకర్షణలు ఖాత్ అల్ ఖైర్, దాదాపు 450 మంది అతిథుల వసతి సామర్థ్యము కలదు.

షేఖ్ అబ్దుల్లాహ్ అల్ సాలిమ్ మ్యూజియం పాలెస్, వన్సా బీచ్ (వన్సా బీచ్)లో వివిధ రకాలైన జలక్రీడల వసతులతో స్వచ్ఛమైన నీరు మరియు బంగారపు రంగు ఇసుక ప్రాంతంలో ఏర్పాటు చేయబడినది.



కువైట్‌లో ఫైలకా దీవి సుందరమైన, ముఖ్యమైన పురాతన దీవి. ఈ దీవి కువైట్ యొక్క పురాతన మరియు ఆధునిక చరి త్రల కలయిక.

ఈ దీవిలో క్రీస్తు పూర్వము కాలం నుంచి ఆధునిక కాలము వరకు ఎన్నో పురాతన చిహ్నాలు సురక్షితమై వున్నవి. కువైట్ రవాణా సంస్థ (కెపిటిసి) ప్రతి దినము కువైట్‌లోని సాల్మియ ప్రాంతము నుంచి ఫైలకా దీవికి నౌకా రవాణా వసతి ఏర్పాటు చేసినది.

కువైట్‌లో వేరే దీవిలు కూడా సందర్శించ వచ్చు వాటిలో ముఖ్యమైనవి: ఉమ్ అల్ మరదిమ్, బుబియాన్, ఖరూచ్, ఉహ్హ్ వర్బా, మరియు మిస్కాన్.

సంప్రదించుటకు: 25742664

ఖండాంతర ఖ్యాతిని సంపాదించి పెట్టిన అగ్ని - 5

ప్రస్తుతం ఖండాంతర క్షిపణి సత్తా కలిగిన దేశాలు - అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, భారత్. భారత శాస్త్రవేత్తలు సాధించిన ఈ విజయంపై దాదాపు రాజకీయ ప్రముఖులందరూ అభినందనలు తెలియజేశారు. పాఠకుల కోసం అగ్ని - 5కి సంబంధిమచిన కొన్ని వివరాల్ని క్రింద ఇస్తున్నాము.



May .indd 7 5/5/12 2:01 PM

ఉదయభాను

ఇస్లామీయ సంస్కృతి - శిష్టసంస్కృతి

మానవుని స్వాభావిక భావోద్రేకాలను ఆరోగ్యవంతమయినవని, పరిశుద్ధమయినవని ఇస్లాం ప్రకటించిన రీతిలో ప్రపంచంలోని మరే మత ధర్మమూ చెప్పలేదు. దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

'జనులకై-మనోభిరామమయిన కాంక్షలు, స్త్రీలు, సంతానం, వెండి బంగారాలు, మన్నికయిన గుర్రాలు, పశువులు (పాడి), వ్యవసాయ భూములు - ఇవన్నీ మనోజ్ఞంగా చెయ్యబడ్డాయి'. (ఆలి ఇమ్రాన్:14)

షహవాత్-అంటే సహజంగా మనిషి ఇష్టపడే, అతని మనసును దోచుకునే వస్తువులు అని భావం. అందుకే ఆ వస్తువులు కోరుకోవడం, వాటి పట్ల మోజు చూపడం తప్పు కాదు. కాకపోతే ఈ విషయంలో మనిషి మితి మీరకూడదు. షరీతయతు విధించిన హద్దులను అతిక్రమించకూడదు. వాటిని మనిషి కొరకు ఆకర్షవంతంగా, మనోజ్ఞమైనవిగా చేయడం అన్నది కూడా దేవుని తరఫు నుంచి ఓ పరీక్షే. **"మేము మనుషులను పరీక్షించే నిమిత్తం భూమిపై ఉన్నవాటిని మనోజ్ఞమయినవిగా చేశాము".** (అల్ కహఫ్: 7)

ఇస్లాం కోరికల దాస్యాన్ని మంచి దృష్టితో చూడదన్న విషయం నిజమే. అది మనిషిపై కళ్ళెం లేని కోరికలు, భావేద్రేకాలు అధికారం చెలాయించే వరకు వీటికై అర్రులు చాచడానికి వీలు పడదు అంటుంది. ఎందుకంటే కళ్లెం లేని కోరికలు మనిషిలోని శక్తిసామర్థ్యాల కేంద్రాన్ని సర్వనాశనం చేసి వేస్తాయి. మనిషిని పశు స్థాయికి దిగజార్చుతాయి. ఈ విషయమై ఇస్లాం వ్యక్తిపై కొన్ని ఆంక్షలు విధించడానికి కారణం అతను తన స్వేచ్ఛ దుర్వినియోగం చేసి తన స్వయానికి, కుటుంబానికి, సమాజానికి ఎలాంటి హాని కలుగజెయ్యకుండా ఆనంద మకరందాన్ని గ్రోల గలగాలన్నదే. మనోనిగ్రహంకై చేసే సూచన నిర్బంధ శాసనం కాదు. దీని వెనక ఎంతో నిగూఢ వివేచన దాగి ఉంది. ప్రపంచ సుఖాలను జీవితాశయానికి తగినట్లుగా మలచుకోవడం. ఏ జాతి ప్రజలయితే తమ మనోకాంక్షల్ని, భావోద్రేకాలను తమ అధీనంలో ఉంచుకోలేరో, మరెవరైతే అవసరం ఏర్పడినా తమకు ప్రియమైన వాటిని వదులుకోవడం ఇష్టపడరో అలాంటి జాతి నాయకత్వపు హోదాను పొందజాలదు. అలాగే అంతర్జాతీయ సంఘర్షణల్లో ఏ జాతి జనులయితే కష్టాలను, ఆపదలను భరించే సామర్థ్యం కలిగి ఉంటారో, ఎవరయితే అవసరం కలిగినప్పుడు తమ మనోభిరామమయిన కోరికల్ని గంటలు, దినాలే కాదు సంవత్సరాల తరబడి త్యజించి నిబ్బరం చూపగలరో అలాంటి దృఢ సంకల్పులకే, ఉత్తములకే, పురుషోత్తములకే విజయశ్రీ కాళ్ళు పడుతుంది. ఇక పిచ్చి స్వేచ్ఛ కోసం మనసిచ్చిన మనిషి, ఒక ఉన్నతాశయం కోసం కొన్ని గంటలయినా తన మనోకాంక్షల పొగరుబోతు గుర్రాన్ని కళ్ళెం వెయ్యలేని మనిషి కూడా ఒక మనిషేనా? ఇటువంటి కాంక్ష దాసులు మానవాళికి ఎన్నడూ ఎలాంటి సెవనూ చెయ్యలేరు. తనకు ప్రియమైన విలాసాలను త్యాగం చేసే సాహసించలేరు.

ఇస్లాం సాధించిన మహత్కార్యాల్లో, మహాద్భుతాల్లో, అలనాటి అరబ్బు ఆటవిక, అనాగరిక, మొరటు ప్రజల్ని సంస్కారవంతులయిన మానవుల సంఘంగా, ఓ ఉత్తమ జాతిగా తీర్చిదిద్దడం ఒకటి. అది వారికి కేవలం రుజుమార్గం మాత్రమే చూపలేదు. కేవలం వారిని పాశవిక స్థాయి నుండి లేవనెత్తి వారికి మానవత్వపు ఉన్నత విలువలను పరిచయం చెయ్యడమే కాదు, వారిని ఇతరులకు మార్గదర్శకులుగా, దైవధర్మధ్వజవాహకులు, ప్రచారకులుగా కూడా తీర్చిదిద్దింది.

మచ్చుకు కొన్ని సంఘటనలు:

ఉహద్ సంగ్రామం అనంతరం హజ్రత్ హమ్జా (ర) గారి మృత దేహం ముక్కలు ముక్కలుగా ఖండించబడి, చెవులు, ముక్కు కోయ బడి ఎంతో భయంకరంగా, కడు దయనీయంగా ఉంది. దాన్ని చూడగానే దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆవేదనాభరితమైన ఆయన హృదయం నుంచి సన్నగా (ఈ క్రింది) శబ్ద తరంగిణి జాలువారింది. 'అబ్బా! ఇంతటి దారుణమైన దృశ్యం నేనింత వరకు చూడలేదు. హమ్జా సోదరి సఫియా మనసు బాధ పడుతుందన్న భయమే గనక లేకపోయి ఉంటే, ఈ పని నా అనంతరం అనవతర ఆచారంగా మారుతుందేమోనన్న భయమే గనక లేకపోయి ఉంటే నేను హమ్జా దేహాన్ని ఇలాగే గద్దలకు, మృగాలకు, క్రీమికీటకాలకు వదిలి పెట్టేవాడ్ని. ప్రళయ దినాన తాను ఆయా ప్రాణుల పొట్టల నుండి లేపబడేవాడు'.(అబూ దావుద్, తిర్మిజీ)

పై సంఘటనలో భావోద్రేకాల వెల్లువ కట్టులు తెంచుకోబొతుండగా వెలువడి మాటలు అవి. అయితే మహా ప్రవక్త ప్రవక్త ముహమ్మద్ (స) వారు భావోద్రేకాల ప్రవాహంలో కొట్టుకుపోలేదు. న్యాయానికి, కరుణకి కట్టు బడ్డారు. ఆయన హమ్జా మృతదేహాన్ని ఖననం చేశారు.

హజ్రత్ అలీ (ర) గారి కథనం - దైవ ప్రవక్త (స) వారు కొందరిని సైనిక చర్యల నిమిత్తం పంపిస్తూ, వారికి నాయకునిగా ఒక అన్సారు వ్యక్తిని నియమించి, అతని పట్ల విధేయత కనబర్చవలసిందిగా పురమాయించారు. (ప్రయాణం మధ్యలో ఏదోక కారణంగా) ఆ వ్యక్తి అగ్రహోదగ్రుడయ్యాడు. (కోపంతో ఊగిపోతూ) **'ఏమీ! నా పట్ల విధేయత కనబర్చమని ప్రవక్త(స)వారు చేసిన హితవు నిజం కాదా?'** అన్నాడు.

May .indd 8 5/5/12 2:01 PM

అందరూ నిజమే అన్నారు ముక్తకంఠంతో. అలాగయితే నా ఆజ్ఞ మేరకు కట్టెల్ని ప్రోగు చేయండి. వారు మారు మాట్లాకుమడా కట్టెల్ని ప్రోగు చేశారు. వాటికి నిప్పంటించండి అని మళ్ళీ గర్జించాడు. నిప్పం టించడం జరిగింది. అవి బాగా కాలాక–అందరినీ ఉద్దేశ్యించి 'నేనాదే శిస్తున్నాను మిమ్మల్ని మీరు ఈ అగ్నికి ఆహుతి చేసుకోండి' అని అరిచాడు. అందరూ అయోమయంలో పడ్డారు.

ఒకరు మరొకరిని పట్టి లాగనారంభించారు. ఈ అగ్నికి ఆహుతి అవ్వడంకన్నా ప్రవక్త (స) వారి కారుణ్య సన్నిధికి పారిపోడం మేలని భావించారు. నిప్పు పూర్తి ఆరిపోయేంత వరకు వారి స్థితి అలానే ఉంది. చివరికి మంటా చల్ల బడింది, అతని కోపమూ తగ్గింది. ఈ విషయం తర్వాత కారుణ్యమూర్తి(స) వారి కర్ణపుటాలకు చేరింది. సాంతం విన్న కారుణ్యమూర్తి (స) ఇలా అభిప్రాయపడ్డారు: "ఒకవేళ వారు అతని మాటననుసరించి అగ్నికి ఆహుతి అయ్యుంటే ప్రళయం వరకు దాన్నుండి బైటకు రాగలిగేవారు కాదు. విధేయత అన్నది మంచి కార్యాల్లో మాత్రమే సుమీ!" అని మందలించారు.

(బుఖారీ, ముస్లిం)

పై సంఘటనలో మనసు ప్రవక్త (స) వారి ఆజ్ఞను గౌరవిస్తూ నాయకుని మాటకు విధేయత చూపాలని పదే పదే చెబుతున్నా, మేలిమి మెదడు దాన్ని నిరాకరిస్తోంది. ప్రేమకు నిలయమైన, కరుణకు ఆలయమైన ఇస్లాం ధర్మంలో మేధకు మింగుడు పడని విషయానికి విధేయత చూపాలన్న ఆజ్ఞ ఎలా ఉండగలదు? అని ప్రశ్నిస్తోంది. కాబట్టి అట్టి సందర్భాలు ఎవరికి ఎప్పుడు, ఎక్కడ ఎదురయినా భావోద్రేకానికి లోనయి ధర్మం కోరని త్యాగానికి పూనుకోవడం మాని ధర్మం అంగీకరించిన మేలిమి మేధ చూపే న్యాయానికి కట్టుబడాలని దైవప్రవక్త (స) సెలవిచ్చారు.

ఇస్లాంలో ఆరాధనా గృహాన్ని నేలమట్టం చేయడం, అటువంటి కట్టడానికి నష్టం చేకూర్చడం, అందులో ఆరాధన నుండి, దైవనామ స్మరణ నుండి జనులను ఆపడం, షరీయతు ఆదేశాలను పాటించ కుండా నిరోధించడం ఇత్యాదివన్నీ నిషిద్ధం. అయితే ఆరాధన కోసం కాక కేవలం ముస్లింల మధ్య గల ఐకమత్యాన్ని నీరుగార్చే దురుద్దేశ్యం తో నిర్మించబడే మస్జిద్‌ను విద్వాంసులు **'మస్జిదె జిరార్'**గా అభివర్ణిం చారు. కాబట్టి ముస్లింలలోని చీలికను నివారించడానికీ, వారి సంఘ టిత వ్యవస్థకు విఘాతం కలుగకుండా ఉండటానికి అటువంటి మస్జిద్ లను కూల్చివేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదని ఖుర్‌ఆన్‌లోని ఓ ఆయతు ద్వారా రూఢీ అవుతుంది. సాధారణంగా ఇటువంటి వాటిని మస్జిద్ పట్ల మర్యాద గల మనసు అంగీకరించదు. అయితే మేలిమి మేధ చూపే న్యాయానికి అనుగుణంగానే అల్లాహ్ ఈ ఆదేశాన్ని అవ తరింపజేశాడు:

"(కపటులలో) మరికొంత మంది కూడా ఉన్నారు – కీడు కలిగించే, అవిశ్వాసం కూడిన మాటలు చెప్పుకునే ఉద్దేశ్యంతో, విశ్వాసుల మధ్య చీలికను తెచ్చే లక్ష్యంతో, అంతకు మునుపు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను వ్యతిరేకించిన వ్యక్తికి ఆసరా ఇచ్చే ఆలోచనతో వారు ఒక మస్జిదు నిర్మించారు. (ఈ కట్టడాన్ని నిర్మించటంలో) తమ ఉద్దేశ్యం మేలు చేయడం తప్ప మరొకటి కాదని వారు ప్రమాణాలు చేస్తారు. వారు అబద్ధాలకోరులన్న విషయానికి అల్లాహ్ సాక్షి".

(అత్ తౌబా: 107)

వివరాల్లోకెళితే-

కపటులు ఒక మస్జిదు నిర్మించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు, చలి గాలులు వీస్తున్నప్పుడు, తీవ్రమైన ఎండ పడుతన్నప్పుడు తమలోని బలహీనులు, వృద్ధులు దూరం నుంచి మస్జిదె నబవీ వరకూ రావడం కష్టంగా ఉందనీ, వారి సౌలభ్యం కోసమే తాము మరొక మస్జిదును కట్టామని వారు దైవప్రవక్త (స) వారిని నమ్మబలకడంతోపాటు, తమరు గనక ఒకసారి వచ్చి అందులో నమాజు చేస్తే ఎంతో శుభం చేకూరు తుందని విజ్ఞప్తి కూడా చేశారు. కాని ఆ సమయంలో ప్రవక్త (స) తబూక్ యుద్ధానికి బయలుదేరుతున్నారు, ప్రయాణ నుంచి తిరిగి వచ్చాక, అక్కడికి వచ్చి నమాజు చేస్తానని వాగ్దానం చేశారు. అయితే తబూక్ నుండి తిరిగి వస్తున్నప్పుడు అల్లాహ్, వహీ ద్వారా ఆ మస్జిద్ వెనుక ఉన్న దురుద్దేశాలను బట్టబయలు చేశాడు. ముస్లింల మధ్య మనస్పర్థలను సృష్టించడం, అవిశ్వాసాన్ని వ్యాపింపజేయటం, దైవానికి, దైవప్రవక్తకు శత్రువుగా వ్యవహరిస్తున్న వారి కోసం ఆసరాను సమ కూర్చడం వారి ఉద్దేశ్యం అని తెలియజెయ్యడమేకాక లోగడ నువ్వు చేసిన వాగ్దానాన్ననుసరించి ఆ మస్జిద్‌కు వెళ్ళకు అని ఆదేశించాడు కూడా: **"నువ్వు ఎన్నడూ అందులో నిలబడకు. అయితే తొలినాటి నుంచే దైవభీతి–తఖ్వా పునాదిపై నిర్మించబడిన మస్జిదు నువ్వు నిల బడటానికి అన్ని విధాలా తగినది. బాగా పరిశుద్ధతను పొందటాన్ని ఇష్ట పడేవారు అందులో ఉన్నారు. బాగా పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు".** (తౌబా:108)

ముస్లింల మధ్య మనస్పర్థల్ని సృష్టించే ఉద్దేశ్యంతో నిర్మితమైన ఎలాంటి విగ్రహ ప్రతిమలు లేని మస్జిద్‌లలోనే నిలబడకూడదు, వాటిని కూల్చేయాలని అల్లాహ్ అదేశిస్తున్నప్పుడు, నేడు ముస్లింల విశ్వాసానికి తూట్లు పొడవాలన్న, వారి పురోభివృద్ధిని అసలు కారక మైన తౌహీద్‌ను అడుసులో తొక్కెయ్యాలన్న ఉద్దేశ్యం పునాదిగా కుత్సిత మతుల కుయుక్తులతో నిర్మించబడిన శవాలు పూడ్చబడిన దర్గాల గురించి ఇస్లాం ఎలాంటి ఆదేశాలు కలిగి ఉంటుందో సుమతులైన సమాలోచనాపరులు సునిశితంగా ఆలోచించాలి. అలాగే పాక్షికమైన కొన్ని విభేదాలను ప్రధానమయినవిగా చిత్రీకరిస్తూ కేవలం దైవారాధన కోసం నిర్మించబడే మస్జిద్‌లను కూల్చడం, కాల్చడం ఎంతటి భయం కర నేరమో యోచించాలి. అదే పని ఒక ముస్లిమేతరుడు చేస్తే కాఫిర్ (అవిశ్వాసి–తిరస్కారి), నరకవాసి అని ఫత్వాలు జారీ చేసే పండిత మహాశయులు ఆయా సమాధుల్లో గల వ్యక్తుల పట్ల అభిమానంతో భావోద్రేకాలకు లోనవ్వకుండా ధర్మం చెప్పే తీర్పుకి, చూపే న్యాయాని కి తల వంచాలి. అలా వంచిన నాడే మళ్ళీ ముస్లిం సమాజం నిండు స్వేచ్ఛతో తలెత్తుకుని పురోగమనం వైపు సాఫీగా అడుగెయ్యగలదు. ఇహంలో విజేతగా నిలిచి, పరంలో స్వర్గవాసిగా నీరాజనాలందుకొ గలదు.

ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **'ఓ అజ్ఞానుల్లారా! అల్లాహ్‌ను వదలి ఇతరుల ను పూజించమని మీరు నాకు ఆజ్ఞాపిస్తున్నారా?'** అని ఓ ప్రవక్తా వారిని అడుగు. నిశ్చయంగా నీ వద్దకు, నీకు పూర్వం వచ్చిన ప్రవక్తల వద్దకు పంపబడిన సందేశం ఇది: **"ఒకవేళ నువ్వు గనక బహు దైవారాధన (షిర్క్)కు పాల్పడితే నువ్వు చేసుకున్నదంతా వృథా అయిపోతుంది. మరి నిశ్చయంగా నువ్వు నష్టపోయిన వారిలో చేర్తావు. కాబట్టి, నువ్వు మాత్రం (ఒక్కడైన) అల్లాహ్‌నే ఆరాధించు. అనంతరం అనవతరం కృతజ్ఞతలు తెలుపుకునే వారిలో చేరిపో".**

(జుమర్: 64–66)

(ఇంకా ఉంది)

May .indd 9 5/5/12 2:01 PM

అన్నిటిపై ప్రేమ కురిపించిన అగ్రజుడు

అగ్రజుల వారు (స) సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన కారుణ్యంగా వచ్చారు. ఆ మేరకు ఎవరో కాదు, స్వయంగా ఆ సత్య స్వరూపుడయిన అల్లాహ్‌యే కితాబు ఇచ్చాడు: **"(ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త లోకాల పాలిట కారుణ్యంగా చేసి పంపాము". (అల్ అన్బియా: 107)**

చిన్న పిల్లల యెడల అగ్రజుల వారికి గల అనురాగం అమితమైనది. ప్రయాణం నుంచి తిరిగి వస్తున్నప్పుడల్లా దారిలో పిల్లలు కనబడితే వారిని తన వాహనంపై కూర్చోబెట్టుకుని వచ్చేవారు. ఎక్కడైనా చిన్న పిల్లలు కనబడితే తనే ముందుగా వాళ్ళకు సలాం చేసేవారు. అలాగే ఎప్పుడు కొత్త పంట వచ్చినా అందరికన్నా ముందు పసి వాళ్లను పిలిచి ఇచ్చేవారు. చిన్న పిల్లల్ని ఎత్తుకుని ముద్దాడేవారు. ఇది చదువుతుంటే మనమూ పిల్లలయిపోదాం అన్పిస్తుంది కదూ!

అగ్రజుల వారి ఈ ప్రేమానురాగాలు కేవలం విశ్వాసుల పిల్లలకు మాత్రమే పరిమితం కాలేదు. అవిశ్వాసుల పిల్లలపై కూడా ఇలాగే వాత్సల్యం కనబర్చేవారు. ఒకసారి ఒకానొక యుద్ధంలో కొంతమంది చిన్నారులు అడ్డు వచ్చి చంప బడ్డారు. ఈ సంగతి తెలుసుకున్న అగ్రజుల వారు ఎంతగానో విలపించడంతో పాటు కోపగించుకున్నారు. 'యా రసూల ల్లాహ్! ఆ పిల్లలు అవిశ్వాసుల వర్గానికి చెందినవారులెండి' అని ఎవరో అంటే– 'అవిశ్వాసుల పిల్లలయితేనేం వారు పిల్లలే కదా! వారు మీకన్నా ఎంతో ఉత్తములు. జాగ్రత్త! (ఇకపై పిల్లల గురించి ఇలా మాట్లాడకండి) పిల్లల్ని చంపకండి.ప్రతిప్రాణీ దైవ ధర్మాను సారమే పుట్టించ బడుతుంది సుమా!' అని గట్టిగా మందలించారు. (ముస్నద్ అహ్మద్)

అగ్రజుల వారు (స) బానిసల, శ్రమజీవుల పట్ల ప్రత్యేకంగా జాలి చూపేవారు. **'వారు మీ సోదరులే కాబట్టి మీరు తినేదే వారికి పెట్టండి. మీరు ధరించేటటువంటివే వారికీ ఇవ్వండి'** అని తరచూ తన సహచరులకు హితవు పలికేవారు.

ఓ సారి అబూజర్ గిఫారీ (ర) ఆయన అరబ్బేతరుడైన బానిసను చీవాట్లు పెట్టారు. ఆ బానిస సరాసరి అగ్రజుల వారి (స) కారుణ్య సన్నిధికి వచ్చి ఫిర్యాదు చేశాడు. అగ్రజుల వారు (స) అబూ జర్ (ర)ను పిలిపించి (కొపాన్ని ప్రదర్శిస్తూ) **"మీలో ఇప్పటికి అజ్ఞాన ప్రవృత్తి మిగిలే ఉంది. ఈ శ్రమజీవులు మీ సోదరులు. దేవుడు వారిపై మీకు అధికారమిచ్చాడు (అని అతిగా ప్రవర్తించకండి). ఒకవేళ అతడు మీ అభిరుచికి తగినట్లు లేకుంటే అతన్ని ఇతరులకు ఇచ్చేయండి. అంతేగాని అల్లాహ్ దాసులను వేధించకండి. (వారిని చులకన చేసి మాట్లాడకండి.) మీరు తినేదే వారికి పెట్టండి. మీరు తొడిగేదే వారిలి తొడిగించండి. వారు చేయలేనంత పని భారాన్ని వారిపై మోపకండి. ఒకవేళ పని ఎక్కువగా ఉంటే మీరు కుడా వారికి సహాయ పడండి"** అని మందలించారు. (బుఖారీ)

అగ్రజుల వారి వాత్సల్యం మానవుల వరకే పరిమితం కాలేదు. పశుపక్ష్యాదులపై సయితం ఆయన ఎంతో దయ చూపేవారు. తరతరాలుగా నోరులేని ఆ మూగ జీవాలపై జరిగే దౌష్ట్యాన్ని మాన్పించారు. పూర్వం అరబ్బులు గొర్రెపోతు వంటి జీవాలను సజీవంగా ఉంచి వాటి శరీరం నుంచి కొవ్వు పదార్థాన్ని తీసుకుని శరీరానికి కుట్లు వేసేవారు. ఆ కొవ్వును వండుకుని తినేవారు. ఈ అన్యాయాన్ని కూడా అగ్రజుల వారు (స) సమూలంగా అరికట్టారు. పశువుల తోకను కత్తిరించడాన్ని కూడా నిరసించారు. పశువుల, పక్షుల మధ్య పందెం కాసి(కోడి, ఆంబోతు పందెంలాంటివి) వాటిని హింసించి పైశాచికానందంతో పరవశించడాన్ని అధర్మంగా ఖరారు చేశారు. ఆ కాలంలో పశువులను లక్ష్యంగా కట్టి వాటిపై బాణాలు ప్రయోగించేవారు. ఈ నిర్దాక్షిణ్య వైఖరిని కూడా అగ్రజుల వారు (స) తీవ్రంగా ఖండించారు.

May .indd 10 5/5/12 2:02 PM

ఓసారి ఒక గాడిద దారిలో అగుపడింది. దాని ముట్టెపై వాత వేయబడి ఉంది. ఇది చూసి అగ్రహించిన అగ్రజుల వారు (స) **'దీని ముట్టెపై వాత వేసిన (క్రూరుడు) దైవం చేత ధూత్కరించ బడ్డాడు'** అని శపించారు.

ఒక సహచరుడు అగ్రజుల (స) వారి అనురాగ సన్నిధికి వచ్చాడు. ఆయన చేతిలో ఒక రుమాలు ఉంది. ఆ రుమాలులో ఒక పక్షి పిల్లలు చుట్టబడి ఉన్నాయి. వాటిని గురించి అగ్రజుల వారు వాకబు చెయ్యగా, తాను అడవిలోంచి వస్తుండగా ఒక చోట అలికిడి అయిందని, వెళ్ళి చూస్తే పక్షి పిల్లలు కన్పించా యని, ముచ్చటేసి వాటిని తాను ఎత్తుకొచ్చానని, ఆ సమయంలో ఈ పిల్లల తల్లి (పక్షి) తల్లడిల్లిపోతూ తనను వెంబడించిందని వివరించాడు. సాంతంగా ప్రశాంతంగా విన్న విశ్వ కారుణ్యమూర్తి (స) **'వెళ్ళండి, ఈ పసి కూనల్ని ఎక్కణ్ణుంచి తెచ్చారో అక్కడే వది లేసి రండి'** అని (కాస్త కటువుగానే) ఆదేశించారు. (మిష్కాత్)

ఒకసారి దారిలో ఓ ఒంటె తారసపడింది. అది బాగా చిక్కిపోయి ఉంది. ఆకలితో దాని డొక్కలు రెండూ అతుక్కుపోయినట్లుగా ఉన్నాయి. గ్రాసం లేక నీరసించిపోయిన ఆ ఒంటె అగ్రజుల వారి అనురాగ ముఖారవిందాన్ని చూడగానే మూగ భాషలో తన గొడును చెప్పుకుంది. అగ్రజుల వారు (స) ఎంతో ఆప్యాయతతో దానిని చేత్తో నిమిరారు. తరువార ఆయన అక్కడున్న వారినుద్దే శించి 'ఈ ఒంటె ఎవరిదని ఆరా తీశారు'. అదొక అన్సారీ వ్యక్తిదని తెలిసి అతన్ని పిలిపించి: **'నోరు లేని ఈ మూగ జీవుల విషయంలో మీరు దైవానికి భయపడటం లేదా?'** అని మంద లించారు. (అబూ దావూద్)

మఖ్‌జూమ్ తెగకు చెందిన ఒక మహిళ దొంగతనానికి పాల్పడి పట్టుబడింది. ఆమెకు శిక్ష పడకుండా తప్పించే ఉద్దేశ్యంతో కొంత మంది, అగ్రజుల (స) వారికి అత్యంత ఆప్తుడయిన ఉసామా బిన్ జైద్ (ర)ను సిఫారసు కోసం పంపించారు. ఉసామా సిఫారసు చేశారు. ఇది విన్న అగ్రజుల (స) వారు – **"ఉసామా! అల్లాహ్ నిర్ణయించిన హద్దులపై నువ్వు సిఫారసు చేస్తున్నావా?"** అని అన్నారు. దరిమిలా అగ్రజుల (స) వారు ప్రజలనుద్దేశించి 'వెనుకటి జాతుల వారు ఎందుకు నాశన మొనర్చబడ్డారో మీకు తెలుసా?! సంఘంలో పెద్ద మనుషులుగా చెలామణి అయ్యేవారు నేరం చేస్తే వాళ్ళు చూసిచూడనట్లుగా వ్యవహరించేవారు. అదే ఒక మాములు మనిషి తప్పు చేస్తే శిక్ష విధించేవారు. (నేను మాత్రం అలా చేయను) **దైవ సాక్షి! ఒకవేళ ముహమ్మద్ (స) కూతురైన ఫాతిమా (ర) దొంగతనం చేసినా ఆమె హస్తం ఖండించబడేది" అని అన్నారు.**

(బుఖారీ, ముస్లిం, అబూ దావూద్)

జోల పాట

శాంతి ప్రియ

లా ఇలాహ ఇల్లల్లాహ్
లా ఇలాహ ఇల్లల్లాహ్

బజ్జో తండ్రీ బంగారు కొండా
తౌహీద్ పాట పాడి విన్పిస్తా
లా ఇలాహ ఇల్లల్లాహ్
లా ఇలాహ ఇల్లల్లాహ్

చెప్పేది ప్రతిదీ చెయ్యాలి నీవు
చేసేది మాత్రమే చెప్పాలి నీవు
సదా సత్యమే పలకాలి నీవు
సుగుణశీలివి అవ్వాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
పిన్నలతో ప్రేమగా మెలగాలి నీవు
పెద్దలతో వినయంగా ఉండాలి నీవు
అనుదినం ఆరాధనలు చేయాలి నీవు
దినదినం ప్రగతి సాధించాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
నిస్సహాయులకు చేయూతనివ్వాలి నీవు
నిర్భాగ్యులకు అండగా నిలవాలి నీవు
అనాథల్ని అక్కున చేర్చాలి నీవు
అల్లాహ్ ప్రసన్నతను పొందాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
సత్య ధర్మ ధ్వజవాహకుడవ్వాలి నీవు
అసత్య సేనలతో పోరాడాలి నీవు
సత్య దైవాన్ని మాత్రమే కొలవాలి నీవు
సత్య ప్రవక్త బాటనే నడవాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
నిత్యం నిజ దైవాన్ని ప్రార్థించే వాడిని
నిరతం తోడుండే చందురుడు కావాలని
నా ఇల్లు ఆనందాల హరివిల్లవ్వాలని
నీ నవ్వుల పువ్వులతో కళకళలాడాలని
'బజ్జో తండ్రీ ...'
గగనతలంలోని తారలు ఎన్నో
అంతే ఆయుష్షు పొందాలి నీవు
చెడుగుల చీడలు చెరపాలి నీవు
మమతల మందారాలు పరచాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
ఉదయ రశ్మి వెళ్ళి రాత్రి చీకటి క్రమ్మింది
వెన్నెల్లాంటి పసిడి రంగుల్ని చల్లింది
తమస్సు తోక ముడిచి తిమిరం దాటింది
ఉషస్సు నిండు శోభతో కొలువుదీరింది
'బజ్జో తండ్రీ ...'

ప్రేమ పరిమళ ధార అవ్వాలి నీవు
కరుణ కలువలె విరబూయాలి నీవు
జ్ఞాన శిఖరమలె ఎదగాలి నీవు
విజ్ఞాన వెలుగుల్ని పంచాలి నీవు
'బజ్జో తండ్రీ ...'
నీవు నిదురపోయే సమయమయింది
అల్లాహ్ హాఫిజ్ అంటూ మిణుగురు నవ్వింది
కోకిల సయితం గూటికి చేరింది
మా చిట్టి దేహం నిద్ర ఒడిలో ఒదిగింది
'బజ్జో తండ్రీ ...'

May .indd 11 5/5/12 2:02 PM

అబ్దుల్లా అడియార్ అల్లాహ్‌కు అర్పితమైన దైవదాసుడు. ఆయన కొందరు ప్రముఖ వ్యక్తులకు ఉత్తరాలు రాసి ఇస్లాం సందేశాన్ని వారి ముందుంచే ప్రయత్నం చేశారు. అలాంటి ఒక ఉత్తరాన్ని ఇక్కడ ఇస్తున్నాము.

గౌరవనీయులు, మేడమ్ బ్లాసమ్ వాజ్ (ప్రెసిడెంట్, ఆల్ ఇండియా క్రిష్టియన్ సర్వీస్ సొసైటి, మధురై)

మీకు శాంతి కలుగుగాక!

మీతో పరిచయం ఏర్పడినందుకు నేను దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీరు మీ పరిమిత వనరులతో బీదలకు కారుణ్యాన్ని పంచుతున్నారు. అణగారిన జనానికి ఉచిత న్యాయ సహాయాన్ని, వ్యాధిగ్రస్తులకు మందులు, నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం సిఫారసులు అందజేస్తున్నారు. అనాథలు చనిపోతే, వారి అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దైవం మీకు తగిన ప్రతిఫలం ఇవ్వుగాక! ఆమీన్.

ప్రపంచం భౌతికారాధనలో, ధనవ్యామోహంలో చిక్కుకొని ఉన్న ప్రస్తుత కాలంలో, బీదలకు నిరాపేక్షంగా సేవ చేయాలన్న పవిత్ర భావాన్ని దైవం మీ మనసులో నాటుకునేలా చేశాడు.

మీరు ఆంగ్లో-ఇండియన్ సముదాయానికి చెందిన వారయినప్పటికీ, మీరు ఎల్లప్పుడు సత్యాన్ని, సన్మార్గాన్ని గ్రహించాలన్న జిజ్ఞాస ప్రదర్శిస్తూ వచ్చారు. అందువల్ల నేను మీకు, **'ఐ లవ్ ఇస్లాం'** (నేను ఆరాధించే ఇస్లాం) అన్న నా పుస్తకాన్ని ఇచ్చినప్పుడు మీరు ఇస్లాం గురించి మరింత తెలుసుకోవాలన్న ఆసక్తి చూపారు. **'ఈజీ ఆన్ క్రిటిజమ్'** లో ఈ విషయాన్ని చక్కగా చెప్పారు. స్వల్ప అధ్యయనం ప్రమాదకరమైనది. తనివితీరా తాగండి లేదా జ్ఞానం ఊటను (పీరియన్ స్ప్రింగ్) రుచి కూడా చూడవద్దు" అన్నారు.

క్రైస్తవులు ఎల్లప్పుడు పరిత్యాగాన్ని, సన్యాసాన్ని ఆదరిస్తూ వచ్చారు. దీనిక్కారణం బహుశా ఇతర మత ధర్మాల బోధనల గురించిన అవగాహన లేకపోవడం కాబోలు.

ఇతర మత గ్రంథాలలో ఎక్కడా లేని విధంగా ఇస్లాంలో జీసస్‌క్రైస్ట్ పేరు ప్రస్తావించబడిందని, అల్‌ఖుర్ఆన్‌లో క్రీస్తు పేరు అనేక పర్యాయాలు వచ్చిందని ఆయన్ని ముస్లింలు దైవప్రవక్తగా విశ్వసిస్తారని నేను చెప్పినప్పుడు మీరు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి విన్నారు. ఖుర్ఆన్‌లో క్రీస్తు పేరు ఈ క్రింది అధ్యాయాలలో ప్రస్తావనకు వచ్చింది.

అధ్యాయం	సూక్తులు		
2 (బఖరా)	87	9 (తౌబా)	30
3 (ఆలిఇమ్రాన్)	45-59	19 (మర్యం)	16-34
4 (నిసా)	157	23 (మోమినూన్)	50
4 (నిసా)	171	42 (షూరా)	13
5 (మాయిదా)	17	43 (జుఖ్రుఫ్)	57
5 (మాయిదా)	72	43 (జుఖ్రుఫ్)	61
5 (మాయిదా)	75	43 (జుఖ్రుఫ్)	63
5 (మాయిదా)	78	61 (సఫ్)	6
5 (మాయిదా)	110-120		

ముస్లింలు క్రీస్తు పేరుని గౌరవపూర్వకంగా ఈసా అలైహిస్సలామ్ (ఆయనపై శాంతి వర్షించుగాక) అని ఉచ్చరిస్తారు. కేవలం మర్యాద మన్ననల భావన మాత్రమే కాదు. అది వారి మత విశ్వాసం నుంచి పుట్టిన భావన. ఏ ముస్లిమయినా క్రీస్తు పేరును ఉచ్చరిస్తున్నప్పుడు ఇలా గౌరవప్రదమైన పదాలు ప్రయోగించకపోతే అతను మర్యాదతెలియని అనాగరికునిగా భావించబడతాడు.

ఖుర్ఆన్‌లో పదిహేనుకు మించిన అధ్యాయాల్లో గౌరవనీయ జీసస్‌ను **'దేవుని వాక్యంగా', 'దేవుని చిహ్నంగా', 'దేవుని ఆత్మగా'** ఇంకా అనేక విధాల గౌరవ వచనాలతో ప్రస్తావించడం జరిగింది.

అయితే త్రిత్వం (తండ్రి,కుమారుడు,పరిశుద్ధాత్మ)కు సంబంధించి, శిలువ వేయడం, పునరుజ్జీవనాలకు సంబంధించి ముస్లిములకు, క్రైస్తవులకు మధ్య అభిప్రాయ భేదాలున్నాయన్నది వాస్తవం. కాని జీసస్ క్రీస్తును (ఆయనపై శాంతి వర్షించుగాక) ఖుర్ఆన్ ప్రస్తావించిన విధంగా మరో మతం ఏదన్నా ప్రపంచంలో ఉందా! చూడండి ఖుర్ఆన్ ఎలా ప్రస్తావించిందో:

"అతని పేరు మర్యం కుమారుడయిన మసీహ్ ఈసా. అతను ఇహలోకంలోనూ, పరలోకంలోనూ గౌరనీయుడవుతాడు. దైవ సాన్నిధ్యం పొందినవారిలో ఒకడై పోతాడు." (ఖుర్ఆన్-3:45)

గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) చూపిన మహిమల విషయానికి వస్తే మార్క్, మాథ్యు, లూకా, జాన్‌లు రాసిన గాస్పెల్‌లలోని విషయాలు-అంధులకు దృష్టి ప్రసాదించడం, కుష్టువారికి స్వస్థత ఇవ్వడం, మృతులకు ప్రాణం పోయడం మొదలైన వాటి గురించి క్రైస్తవులకు తెలుసు. కాని, మట్టి పక్షుల మహిమ గురించి మీరు విన్నారా!

"ఇప్పుడు నేను మీ ముందు మట్టితో పక్షి ఆకారం గల బొమ్మ చేసి అందులో గాలి ఊదుతాను. అది దైవాజ్ఞతో సజీవ పక్షిగా మారుతుంది." (ఖుర్ఆన్-3:49)

ఈ మట్టి పక్షి మహిమ క్రైస్తవులకు కొత్త విషయం. కాని బైబిల్ పండితులు ఈ మహిమ గురించి "అపోక్రైదల్ గాస్పెల్"లో ఉందని ఒప్పుకుంటారు. అంతేకాదు గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) పుట్టుకతోనే బోధకునిగా ఉన్నారని చెబుతుంది ఆ గాస్పెల్.

ఖుర్ఆన్‌లో ఒక అధ్యాయం మేరి (మర్యం) పేరుతో ఉంది (19వ అధ్యాయం) మేరి మాతకు ఈ గౌరవం చివరకు క్రైస్తవ బైబిల్‌లోనూ లభించలేదు. **"దైవదూతలు మర్యంతో "మర్యం! దేవుడు నిన్ను ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధపరిచాడు. యావత్ప్రపంచ మహిళలలో నీకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి తన సేవ కోసం నియమించాడు."** (ఖుర్ఆన్-3:42)

ఇస్లాం అరబ్బులకు మాత్రమే సంబంధించినదయితే, ముహమ్మద్ ప్రవక్త(స) కుటుంబానికి మాత్రమే సంబంధించిన

May .indd 12 5/5/12 2:02 PM

దయితే, అరేబియాకు చెందిన ఎవరో ఒక మహిళను, లేదా ప్రవక్త ముహమ్మద్ (స) తల్లి గారిని, లేదా ఆయన భార్యలలో, కుమార్తెలలో ఎవరో ఒకరిని ఎన్నికైన పరిశుద్ధ మహిళగా, ప్రపంచ మహిళలందరిపై ప్రాధాన్యం ఉన్న మహిళగా పేర్కొని ఉండేది.

అలాకాక ఒక యూద మహిళ అయిన మేరీ మాతను పరిశుద్ధ మహిళగా, ఎన్నికైన మహిళగా, ప్రపంచ మహిళలపై ప్రాధాన్యం లభించిన మహిళగా ఖుర్ఆన్ పేర్కొన్న వైనమే ఈ గ్రంథం దేవుని వాక్కు అని, పూర్తి సత్యం అని, సత్యం తప్ప మరేమీ కాదని చెప్పడానికి ప్రబల తార్కాణం.

క్రైస్తవుల గురించి కూడా దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రస్తావించింది:

"విశ్వాసుల పట్ల అందరికన్నా ఎక్కువ శత్రువైఖరి అవలంబించే వారు యూదులు, బహుదైవారాధకులే. అది నీకూ తెలుసు. స్నేహ సంబంధాల విషయంలో 'మేము నసారా (సహాయకులం)' అన్నవారు విశ్వాసులకు చాలా దగ్గరగా ఉన్నారని కూడా నీకు తెలుసు. దానికారణం వారిలో భక్తిపరులైన పండితులు, వైరాగ్యులైన సాధువులు కూడా ఉన్నారు. వారిలో ఏమాత్రం అహంకారం లేదు." (ఖుర్ఆన్–5:82)

జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక)కు నిజమైన అనుయాయులైన క్రైస్తవుల పరిస్థితి ఏమిటీ? దానికి ఖుర్ఆన్ ఇచ్చే సమాధానం చూడండి:

"ఈసా! నేనిప్పుడు నిన్ను నాదగ్గరికి రప్పించుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను. నిన్ను ధిక్కరించినవారి (దుష్ట పరిసరాల) నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను. నిన్ను తిరస్కరించినవారిపై నిన్ను అనుసరించిన వారికి ప్రళయం వరకు ఆధిక్యతనిస్తాను. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగి వస్తారు. అప్పుడు నేను మీలో ఏర్పడివున్న విభేదాలను గురించి తీర్పు చెబుతాను." (ఖుర్ఆన్–3:55)

అల్లాహ్, గౌరవనీయ జీసస్ (ఆయనపై శాంతి వర్షించుగాక) ద్వారా క్రైస్తవులకు ఒక వాగ్దానం కూడా చేశాడు. వారు గనుక తమ ప్రవక్తను నిజాయితీగా అనుసరిస్తే, అసత్యాలు, ధర్మ నిందలకు పాల్పడనట్లయితే వారికి ఆధిపత్యం ఇస్తానన్నాడు.

మేడమ్! ఇదంతా చదివాక మీరు ఆనందభాష్పాలతో ఇస్లాం పట్ల ఒక విధమైన ఆకర్షణ, ఆదరణల అనుభూతి పొంది ఉంటారు. ఇస్లాం మీకు మీ శరీరంలోని బృహద్ధమనికన్నా చాలా దగ్గరగా ఉన్నట్లు తెలుసుకొని ఉంటారు.

మీరు విజ్ఞత విచక్షణలతో కూడిన ఆచరణా దృక్పథం గల మహిళ అని నాకు తెలుసు. పురుషుల ప్రాబల్యమున్న నేటి ప్రపంచంలో అభాగినులయిన మహిళల కష్టాలు, బాధలను గురించి మీరు ఎప్పుడు పరితపిస్తుంటారు.

ముస్లిములు తమ మహిళలను అణచివేస్తారని, పరదాలలో బంధించి ఉంచుతారని, హక్కులేవీ ఇవ్వరని మీరు కూడా ఇతరుల మాదిరిగా అభిప్రాయ పడుతుండవచ్చు. కాని, మీరు ఖుర్ఆన్‌లోని 'అన్నిసా' (స్త్రీలు) అధ్యాయం అధ్యయనం చేస్తే స్త్రీకి ఇస్లాం ఎలాంటి స్థానమిచ్చిందో తెలుస్తుంది.



మానవ ప్రవృత్తిలో లైంగికవాంఛ అనేది ఒక అద్భుతమైన మిస్టరీ. పురుషుడు శారీరకంగా శక్తిమంతుడై తన జీవితంలో మహిళ పోషించే అతి ముఖ్యమైన పాత్రలను మరచిపోతున్నాడు. మనిషిని గర్భంలో భరించిన తల్లిగా మహిళ పట్ల గౌరవాదాలు చూపవలసి ఉంది. ఒక భార్యగా మహిళ పోషించే పాత్ర వల్లనే పురుషుడు తండ్రి కాగలుగుతున్నాడు. అందువల్ల ఆమె పట్ల గౌరవం కలిగివుండాలి. స్త్రీ గర్భాశయాన్ని మానవాళిని పోతపోసే మూసగా అభివర్ణించిన మతగ్రంథాలు ఏవయినా ఉన్నాయా?

మేడమ్! నేను **'భార్య'** అనే పేరుతో ఓ పుస్తకం రాశాను. బహుశా ఈ సంగతి మీకు తెలుసు. అందులో నేను గర్భాశయం అంటే ఏమిటో వివరించే ప్రయత్నం చేశాను. ప్రసన సమయంలో స్త్రీలు తమ ప్రాణాలు పణంగా పెట్టి బాధను భరించవలసి ఉంటుంది. ఒక్కోసారి మృత్యువు కూడా తటస్థించవచ్చు.

ప్రసవ నొప్పులు, వెయ్యి ఉథములు
కటి ప్రాంతాన్ని ధ్వంసం చేసే నొప్పులు
వెయ్యి రంపాలు ఇక్కడ కోస్తాయి.
ఆమె శరీరం రెండుగా చీలుతుంది
వందలాది రోకళ్ళు దంచుతాయి
పగటి వెల్తురు చూడ్డానికి ఒక జీవి బయటికి వస్తుంది
ఆమె, నా జీవితంలో ప్రతిక్షణం
నన్ను ఆనందపరచడానికి బ్రతికింది.
నేడు రక్తపు మడుగులో శ్వాస విడిచింది.

("వైఫ్" – పేజీ 78,79)

స్త్రీ భరించే బాధలు పురుషుడు గుర్తిస్తే, అతడు తప్పక ఆమెను గౌరవంగా చూస్తాడు. ఎందుకంటే ప్రతి పురుషుడు తన జన్మ సమయంలో పగటి వెలుతురు చూడ్డానికి తల్లి గర్భాశయం నుంచి వచ్చినవాడే కదా!

మేడమ్! నిజమైన ముస్లిములు స్త్రీ గర్భాశయాన్ని గౌరవించాలన్న దేవుని ఆదేశం స్వీకరించినవారు స్త్రీల హక్కులు కబళిస్తారంటే మీరు నమ్ముతారా!

భారత దేశంలో వరకట్నం కారణంగా యువతలు ఎదుర్కొంటున్న కష్టనష్టాల గురించిన చింత కూడా మీలో ఉంది. వరకట్నం కారణంగా అనేకమంది అమ్మాయిలు చివరకు వృద్ధ కన్యలుగా మిగిలిపోతున్నారు. మరికొందరు సోకాల్డ్ అగ్ని ప్రమాదాలకు గురయి బొగ్గులుగా మారుతున్నారు.

కాని ఖుర్ఆన్‌లో 'మహర్' (స్త్రీ ధనం) అన్న పదం ఉంది. ఈ పదం ఇతరులలో అనేక సందేహాలు జనింపజేయవచ్చు.

కానీ వరకట్న సమస్యకు ఇదే పరిష్కారం. భారత మహిళల బానిసత్వానికి ఇదే విముక్తి. సంబంధిత ఖుర్ఆన్ వాక్యం క్రింద ఇస్తున్నాను. **'స్త్రీలకు వారి మహర్ సంతోషంగా చెల్లించండి."**

(ఖుర్ఆన్–4:4)

(ఇంకా ఉంది)

May .indd 13 5/5/12 2:02 PM

ఓ నా చిట్టి చెల్లీ! పరదా పాటించమని చెప్పిందెవరు?

అసంతృప్తి (నో కన్విక్షన్)

పరదా పాటించని స్త్రీని ఉద్దేశ్యించి "మీరు పరదా పాటించ రెందుకండీ" అని అడిగితే, దానికి ఆమె నేనింకా సంతృప్తి చెందలేదు. సంతృప్తి కలిగినప్పుడు ఇన్షా అల్లాహ్ పరదా పాటిస్తాను అని సమా ధానమిస్తుంది ఈ విధంగా జవాబు చెప్పే సోదరీమణులు రెండు విష యాల మధ్య భేదం పాటించాలి. అవి:

మొదటి విషయం **"దైవాజ్ఞ"**

రెండో విషయం **"మానవాజ్ఞ"**

ఒకవేళ పరదా పాటించటం మానవాజ్ఞ అయి ఉంటే అందులో పాపం, పుణ్యం రెంటికీ ఆస్కారముంది. ఇమామ్ మాలిక్ (ర) ఇలా అంటున్నారు: మనిషి మాట సత్యమైనా కావచ్చు లేక అసత్యమైనా కావచ్చు. కనుక ఒక్క దైవప్రవక్త(స) తప్ప మిగతావారి మాటను మీరు అంగీకరించవచ్చు లేదా తిరస్కరించనూ వచ్చు. కాని ఏదైనా ఆజ్ఞ దైవాజ్ఞలకు సంబంధించినదయితే; అంటే దేవుడు తన పవిత్ర గ్రంథం లో ఏదయినా విషయం గురించి ఆజ్ఞాపించి ఉంటే లేక దాని గురించి మానవాళికి తెలియజేయమని తన ప్రవక్తను ఆదేశించి ఉన్నట్లయితే అలాంటప్పుడు అది తనకు సంతృప్తికరంగా లేదన్న సాకుతో ఏ మాన వుడూ దాన్ని తిరస్కరించలేడు. ఏ స్త్రీ లేక పరుషుడయినా ఫలానా ఆజ్ఞ దైవగ్రంథంలో పేర్కొనబడి ఉందని తెలిసి కూడా దాని పట్ల అభ్యం తరం తెలుపుతూ, దాన్ని అంగీకరించటానికి నిరాకరిస్తే వారు తమకు తాముగా ఇస్లాం ధర్మం నుండి బహిష్కరించబడటానికి అవకాశాలు కల్పించుకుంటున్నారని గ్రహించాలి. ఎందుకంటే వారి ప్రవర్తన మూలంగా వారికి దైవాజ్ఞలు సహేతుకమైనవన్న విషయంలో నమ్మకం లేదనీ ఆ విషయంలో వారు డోలాయమాన స్థితికి లోనై ఉన్నారని అర్థ మవుతోంది. ఈ ప్రవర్తన వారి విశ్వాసానికే గొడ్డలి పెట్టు! ఇది చాలా ప్రమాదకరమైన మాట.

ఒకవేళ ఏ సోదరి అయినా తాను పాపాత్మురాలిననీ, మనోవాంఛల్ని అదుపులో పెట్టుకోలేకపోతున్నాననీ, తనకు మనోబలం బొత్తిగా లేదనీ, తన హృదయం బలహీనమైనదని అంటే – ఇలాంటి మాటలు మాత్రం అసంతృప్త భావనల క్రిందికి రావు. ఎందుకంటే ఆమె తన బలహీన తల్ని, తప్పుల్ని ఒప్పుకుంటోంది. అదీగాక ఆమె తనకు ఇష్టమైతేనే దైవాజ్ఞల్ని నెరవేరుస్తాననీ, కష్టమైతే మానేస్తానని చెప్పట్లేదు కదా! అందుకని ఇలాంటి మాటలు అసంతృప్తి భావనల క్రిందికి రావు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"అల్లాహ్, ఆయన ప్రవక్తా ఏ విషయంలోనయినా ఒక తీర్పు చేసి నప్పుడు విశ్వాసి అయిన ఏ పురుషునికయినా, విశ్వాసురాలైన ఏ స్త్రీ కయినా, తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్లీ ఒక నిర్ణయం తీసుకునే హక్కు లేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే, అతను స్పష్టంగా మార్గభ్రష్టతకు గురి అయినట్లే". (అల్ అహ్‌జాబ్ : 36)

సరైన ఆలోచనాసరళి:

మనస్ఫూర్తిగా దైవాన్ని విశ్వసించి, ఆయన్ని సర్వాధికారిగా అంగీ కరించినవారు మారు మాట్లాడకుండా ఆయన ఆజ్ఞల్ని శిరసా వహించాలి. ఒక నిజమైన విశ్వాసి ముఖ్య లక్షణమేమిటంటే అతను దైవదేశాలను విన్న వెంటనే వాటిని అమలు పరచటానికి ప్రయత్ని స్తాడు. విశ్వాసులు దైవాజ్ఞల్ని విన్నదే తడవుగా ఆచరించి చూపిస్తారని స్వయంగా దివ్యఖుర్ఆన్ కూడా ధృవీకరిస్తోంది. విశ్వాసులు ఇలా అంటారు: 'మేము ఆదేశం విన్నాం, శిరసా వహించాం. స్వామీ! క్షమా భిక్ష పెట్టు. చివరికి మేమంతా నీ వద్దకే మరలి వస్తాం". (అల్ బఖర: 285)

దేవుని ప్రతి ఆజ్ఞ విషయంలోనూ మనం అది మన మంచి కోసమే ఉద్దేశ్యించబడినది, అందులో మన కొరకు మేలు దాగి ఉందని భావిం చాలి. ఆయన స్త్రీల కొరకు పరదా పద్ధతిని నిర్ణయించాడు. కనుక పరదా పద్ధతిలో తమ కొరకు మేలు ఉందనీ, అవి తమ మానమర్యా దలను కాపాడుతుందని స్త్రీలు గ్రహించాలి. దేవుడు అన్నీ తెలిసిన వాడు. అంతా ఎరిగినవాడు. ఆయన జ్ఞానం విశ్వాన్నంతటినీ పరి వేష్ఠించి ఉంది. ఆయనకు మనిషి పుట్టుకకు ముందు ఏం జరిగిందో, భవిష్యత్తులో ఏం జరగబోతుందో కూడా తెలుసు. ముస్లింలమైన మనం ఈ విషయాన్ని మనసారా విశ్వసిస్తాం. అలాంటప్పుడు అనంత జ్ఞాన సంపన్నుడైన దేవుని మాటను పక్కన పెట్టి పరిమిత జ్ఞానం కల వాడైన మానవుని మాటను పట్టుకొని వ్రేలాడటం మార్ఖత్వం కాకపోతే మరేమిటి?

వాస్తవంపై ఆధారమయిన ఉదాహరణ:

పైన చెప్పబడిన విషయానికి సంబంధించి ఒక క్రియాత్మక ఉదాహ రణ ను గమనించండి. మనం ఒక కంప్యూటర్ కొన్నామనుకోండి. ఆ కంప్యూటర్‌ను తయారు చేసినవాడు మనకు దగ్గర్లోనే ఉన్నాడు. అతనికి కంప్యూటర్ ఉపయోగించే పరిజ్ఞానంతోపాటు దానికి సంబం ధించిన ఇతర వివరాలు కూడా తెలుసు. అలాంటప్పుడు మనం దారిన పోయే ఏ దానయ్యనో, బండ్లుతోలే ఏ బుచ్చయ్యనో పిలుచుకు వచ్చి మాకు కంప్యూటర్ నేర్పించమని అంటే ఎలా ఉంటుంది.? తలలో తెలి వున్న వాడెవడూ ఆ పని చేయడు. ఆ యంత్రాన్ని ఎలా ఉపయోగిం చాలో ఒకవేళ అది చెడిపోతే దాన్ని ఎలా బాగు చేసుకోవాలో తెలుసు కోవటం కోసం నిపుణుల్ని సంప్రతించమని బుద్ధి మనల్ని ఆదేశిస్తుంది.

ఏ శక్తి సంపన్నుడయితే మనిషిని పుట్టించి, అతన్ని అన్ని విధాలా తీర్చిదిద్దాడో ఆయనే మనిషికి ప్రభువు. కనుక ఒక వస్తువు వల్ల మనిషి కి లాభం చేకూరుతుందో లేక నష్టం కలుగుతుందో సహజంగానే ఆయనకు బాగా తెలిసి ఉంటుంది. అలాంటప్పుడు అల్లాహ్‌ను వదలి, మార్గదర్శకత్వం కోసం ఇతరుల్ని ఆశ్రయించటం, సలహాలు, ఆదేశాల కోసం ఇతరుల్ని సంప్రతించటం అవివేకమే అవుతుంది. ముఖ్యంగా మూర్ఖుల సలహాలను పాటిస్తే మాత్రం వినాశాన్ని కొనితెచ్చుకోవలసి వస్తుంది. దైవేతరుల ముందు తలవంచటాన్ని పిచ్చితనంగా,

May .indd 14 5/5/12 2:02 PM

అబ్దుల్ హమీద్ బిలాలీ



మూర్ఖత్వంగా తెలివితక్కువతనంగా అభివర్ణించవచ్చు. అవివేకుల హితబోధను ఆచరించే వ్యక్తి వినాశానికి గురౌతాడు. శోచనీయమైన విషయం ఏమిటంటే మనకు జవాబు ఇచ్చే శక్తిలేని వారిని మనం జవాబు కోరటం మనలో చాలా మందికి అసలు 'ఇస్లాం' అన్న పదానికి అర్థం ఏమిటో కూడా తెలీదు. వాస్తవానికి ఇస్లాం అంటే దైవాజ్ఞలకు శిరసావహించటం, ఆయనకు పూర్తిగా విధేయత చూపటం, ఆయన ఆదేశాల్ని, నిషేధాల్ని పాలించటం అని అర్థం.

సందిగ్ధంలో పడకు సోదరీ!

మీరెప్పుడయినా పరదా పాటించని సోదరీమణులకు దాని ప్రాముఖ్యతను గురించి బోధిస్తే వారిలో కొంతమంది సోదరీమణులు నేనూ ముస్లింనే. విశ్వాసురాలినే. నేను కూడా ఫర్జ్, నఫిల్ నమాజులు చేస్తుంటాను. రమజాన్ నెలలో ఉపవాసాలుంటాను. హజ్ లాంటి పవిత్ర విధిని కూడా నెరవేర్చాను. ఎన్నో సార్లు ఉమ్రా చేశాను. కొన్ని స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నాను. కానీ పరదా విషయానికొచ్చేసరికి ఎందుకో అది నా మనసుకు నచ్చటం లేదు" అని చెబుతుంటారు. అలాంటి మహిళకు మా సమాధానం ఇది:

చూడండి....! మీరు ఆ గొప్ప పనులన్నీ చేశారు. సంతోషకరమే! వాటన్నిటి మూలం దైవాజ్ఞలే కదా! ఆ విధుల్ని విడిచిపెడితే శిక్షకు గురవుతామన్న భయమున్నప్పుడు కొన్ని ఆజ్ఞల్ని విశ్వసించి మరి కొన్నిటిని వదలివేయటమేమిటి? మరి చూడబోతే వాటన్నిటి మూలం ఒక్కటే కదా! ఉదాహరణకు దైవగ్రంథంలో నమాజ్ చేయటం విధి అని చెప్పబడింది కనుక మీరు నమాజ్ చేస్తున్నారనుకోండి; మరలాంటప్పుడు పరదాను పాటించటం కూడా విధే కదా! ఎందుకంటే ఖుర్ఆన్, హదీసులలో పరదాను పాటించటం విధి అని నిరూపించబడింది. ఈ విషయంలో ఎలాంటి సందేహానికీ తావులేదు.

దేవుడు ఇస్రాయీల్ జాతి వారిని మందలించిన విషయాన్ని మీరెప్పుడూ వినలేదా? వారు కూడా దైవాజ్ఞల్లో కొన్నింటిని అంగీకరించి మరికొన్నిటిని వదలి పెట్టేవారు. వారి గురించి దేవుడు ఇలా అంటున్నాడు: **"మీరు దైవగ్రథంలోని ఒక భాగాన్ని విశ్వసించి, మరొక భాగాన్ని తిరస్కరిస్తారా? మీలో ఇలా చేసే వారిని ఇహలోక జీవితంలో ఘోర అవమానానికీ, పరలోకంలో తీవ్రమైన బాధకూ గురి చెయ్యటం తప్ప మరొక శిక్ష ఏముంటుంది? మీ చేష్టలు అల్లాహ్‌కు తెలియకుండా లేవు."** (అల్ బఖర:85)

ఒక ప్రామాణికమైన హదీసు ప్రకారం దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారు: "ప్రళయదినాన నరకంలో అందరికంటే తక్కువ శిక్ష అనుభవించే వారి అరికాళ్ల క్రింద రెండు నిప్పు తునకలు ఉంచటం జరుగుతుంది. దాని వేడికి వారి మెదడు పొయ్యి మీదున్న కుండ ఉడికినట్లు కుతకుత ఉడికిపోతూ ఉంటుంది." (బుఖారీ 11/376)

ప్రియ సోదరీ!

ఇహలోకపు డాబు, దర్పాల కోసం నీవు పరలోక జీవితాన్ని నాశనం చేసుకుంటావా? నిన్ను నువ్వు భయంకర మైన శిక్షకు గురి చేసుకోదలచావా? మా వరకు మేము పరలోకంలో నీకు మంచి జరగాలనే కోరుకుంటున్నాం. దాని కోసం నువ్వు కాస్త తెలివిగా వ్యవహరించాలనీ, బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మనసారా వేడుకుంటున్నాం.

3) విశ్వాసం మనసులో ఉంటుంది!

మీరెప్పుడయినా పరదా పాటించని స్త్రీలను తమ వైఖరికి కారణమేమిటని అడిగితే వారు ఒక్కసారిగా **"విశ్వాసం (దైవభీతి) మనసులో ఉంటే చాలు. ఎలాంటి పరదాలూ అవసరం లేదు"** అని అనేస్తారు. మరి మీరు ఈ విషయం గురించి ఎప్పుడయినా తోతుగా ఆలోచించారా?

పై సందేహానికి మూలం

కొంతమంది చాలా అవాంఛనీయ అర్థంతో హదీసులకు భాష్యం చెబుతారు. ఉదాహరణకు క్రింద పేర్కొనబడిన దైవ ప్రవక్త(స) ప్రవచనాన్నే తీసుకోండి. **"దేవుడు మీ ముఖాలను, మీ సిరిసంపదల్ని చూడడు. ఆయన మీ మనోగతాన్ని, మీ ఆచరణల్ని మాత్రమే చూస్తాడు"** అని దైవప్రవక్త (స) ప్రవచించారు. (ముస్లిం)

విశ్వాసం మనసులో ఉంటుందన్న మాట ముమ్మాటికీ వాస్తవమే. అయితే విశ్వాసం అనేది మనసులోనే పరిపూర్ణమవుతుందని దైవప్రవక్త ప్రవచన ఉద్దేశ్యం ఎంత మాత్రం కాదు. ఆచరణలు స్వీకృతిని పొందటానికి చిత్తశుద్ధి దైవభీతి ఎంత అవసరమో తెలియజెప్పటమే ఈ హదీసు అసలు ఉద్దేశ్యం. వాస్తవం ఏమిటంటే చిత్తశుద్ధి లేకుండా దేవుడు ఏ పనినీ అంగీకరించడు. ఒకానొక సందర్భంగా దైవప్రవక్త(స) తన ఛాతీవైపు సైగ చేసి చూపిస్తూ **"దైవభీతి(తఖ్వా) ఇక్కడుంటుంది"** అని (మూడుసార్లు) అన్నారు. (ముస్లిం)

నుజ్‌హతుల్ ముత్తఖీన్ సంకలనకర్త దానిని వివరణ ఇలా వివరిస్తున్నారు. "అల్లాహ్ ఏదయినా కర్మకు ప్రతిఫలం ఇచ్చేటప్పుడు ఆంతర్యం, మనస్సును బట్టియే నిర్ణయిస్తాడు. ఇదే విధంగా మనస్సును దైవాభీష్టానికి అనుగుణంగా మలచుకోవడం, కోరికలకు సరయిన మార్గనిర్దేశనం చెయ్యడం, అల్లాహ్‌కు ఆగ్రహం కలిగించే దూషిత గుణాల నుండి పవిత్రం చేయడం కూడా అవసరం.

విశ్వాసానికి నిర్వచనం

మనసులో ఉన్నంత మాత్రాన విశ్వాసం పరిపక్వత చెందదు. పరిపక్వత చెందని విశ్వాసం నరకం నుండి విముక్తి పొందటం కోసం, స్వర్గంలో ప్రవేశించటం కోసం పనికి రాదు అహ్లె సున్నత్ వల్‌జమాత్‌కు చెందిన అత్యధిక మంది విద్వాంసులు విశ్వాసాన్ని ఈ క్రింది విధంగా నిర్వచిస్తున్నారు.

"మనసుతో నమ్మటం, నోటితో ధృవీకరించటం, అవయవాల ద్వారా దాన్ని ఆచరించటం, వ్యక్తపరచడం – ఇదే విశ్వాసం."

(సమాప్తం)

May .indd 15 5/5/12 2:03 PM

అనువాదం:

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ముస్లింలకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు

ప్రశ్న: అల్లాహ్ దృష్టిలో అన్నిటికన్నా పెద్ద పాపం ఏది?

జ: అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించటం (షిర్క్ చేయటం). అల్లాహ్ సెలవిచ్చినట్లు "నిస్సందేహంగా అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించటం (షిర్క్ చేయటం) ఘోరమైన అన్యాయం". (లుఖ్మాన్-13)

అన్నింటికన్నా పెద్ద పాపం ఏది? అని దైవప్రవక్త(స)ను ప్రశ్నించినపుడు **"నిన్ను పుట్టించిన వాడు అల్లాహ్‌యే అయినప్పటికీ నీవు ఆయనకు భాగస్వాముల్ని కల్పించటం (అతి పెద్ద పాపం)"** అని ఆయన (స) సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

ప్రశ్న: షిర్క్ ఎన్ని రకాలు?

జ: షిర్క్ రెండు రకాలు: (1) షిర్కె అక్బర్. (2) షిర్కె అస్ఘర్.

(1) షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్ : దీనికి పాల్పడిన వారు ఇస్లాం పరిధి నుండి తొలగి పోతారు. షిర్కె అక్బర్‌కు ఒడిగట్టిన వారిని అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని అల్లాహ్ సుతరామూ క్షమించడు. ఇది తప్ప ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు."** (అన్‌నిసా-48)

షిర్కె అక్బర్ నాలుగు రకాలు: (అ)దుఆ చేయటంలో, అర్థించటంలో అల్లాహ్‌కు భాగస్వాముల్ని చేర్చటం. (ఆ)సంకల్పంలో ఉద్దేశ్యంలో షిర్క్‌కు పాల్పడటం. (ఇ)విధేయతలో షిర్క్‌కు ఒడిగట్టడం, అంటే అల్లాహ్ హలాల్‌గా చేసిన వాటిని హరామ్‌గా నిర్ధారించటంలో, హరామ్‌గా ఖరారు చేసిన వాటిని హలాల్‌గా చేసుకోవటంలో పండితులు చెప్పినట్లు చేయటం. (ఈ) ప్రేమాభిమానాలలో షిర్క్ అంటే అల్లాహ్‌ను ప్రేమిస్తున్నంతగా లోకంలోని ఇతర సృష్టిరాశులను ప్రేమించటం. షిర్కె అస్ఘర్ (చిన్న షిర్క్): దీనికి ఒడిగట్టిన వారు ఇస్లాం పరిధి నుండి తొలగిపోరు. అయితే సాధ్యమైనంత వరకు చిన్న తరహా షిర్క్ (షిర్క్ అస్ఘర్)కి కూడా దూరంగా ఉండాలి. నలుగురికీ చూపే ఉద్దేశంతో ఒక మంచిపని చేయటం కూడా షిర్కె అస్ఘర్ లోకి వస్తుంది.

ప్రశ్న: షిర్కె అక్బర్-షిర్కె అస్ఘర్ మధ్య గల ముఖ్య తేడా ఏమిటి?

జ: రెండింటి మధ్య ఉన్న కొన్ని తేడాలివి:

షిర్కె అక్బర్ (పెద్ద షిర్క్)కు పాల్పడినవాడు ప్రపంచంలో ఇస్లాం పరిధిలో ఉండడు. పరలోకంలోనయితే శాశ్వితంగా నరకంలో ప్రగ్గుతూ ఉంటాడు. అయితే షిర్కె అస్ఘర్ (చిన్న షిర్క్)కు పాల్పడిన వ్యక్తి ప్రపంచంలో ఇస్లాం పరిధి నుండి తొలగిపోవటంగానీ, పరలోకంలో శాశ్వితంగా నరకానికి ఆహుతి అవటంగానీ జరగదు.

షిర్కె అక్బర్ మనిషి కర్మలన్నింటినీ నాశనం చేసేస్తుంది. కాని షిర్కె అస్ఘర్ కేవలం మనిషి చేసిన ఆ ఒక్క కర్మనే పాడు చేస్తుంది.

ప్రశ్న: షిర్కె అస్ఘర్‌కి చెందిన ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా?

జ: ఉన్నాయి. ఉదాహరణకు: (1) ప్రదర్శనాబుద్ధితో సదాచరణ చేయటం. మహాప్రవక్త(స) ఇలా చెప్పారు: "మామూలు ప్రదర్శనా భావం కూడా షిర్కే" (ఇబ్బు మాజ) (2) దైవేతరుల పేర ప్రమాణం చేయటం (3) అపశకునాలు చూడటం. అంటే పక్షుల ద్వారా, పేర్ల ద్వారా, స్థలాల దారా, పాచికల ద్వారా, బాణాల ద్వారా మొదలగునవి

ప్రశ్న: ఈ షిర్క్ జరగకముందు జాగ్రత్త పడే అవకాశం ఏదన్నా ఉందా?ఒక వేళ అది జరిగిపోతే దానికి ప్రాయశ్చిత్తం ఏమటి?

జ: పేరుప్రతిష్ఠల కోసం మంచిపనులు చేయాలన్న ప్రదర్శనాబుద్ధి (రియా) నుండి కాపాడుకునే పద్ధతి ఏమిటంటే, చిత్తశుద్ధితో దైవ ప్రసన్నతను ఆశించాలి. మనసులో లేశమైనా ప్రదర్శనాతత్వం రాకుండా ఉండటానికి క్రింద పేర్కొనబడిన దుఆ చేయాలి. దైవ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు:

"ప్రజలారా! మీరు ఈ షిర్క్ నుండి మిమ్మల్ని కాపాడుకోండి". అడిగేవాడొకడు ఇలా అడిగాడు: 'ఓ దైవప్రవక్తా!(స) అది చీమ కదలిక కన్నా గుట్టుగా ఉన్నప్పుడు మేము దాని పట్ల ఎలా జాగ్రత్త పడేది? దానికి ఆయన(స) ఇలా సూచించారు, మీరు ఈ విధంగా ప్రార్థించండి:

'ఓ అల్లాహ్! తెలిసీ మేము నీకు సహవర్తుల్ని కల్పించే చేష్ట నుండి నీ శరణు వేడుతున్నాము. తెలయని స్థితిలో గనక మా వల్ల షిర్క్ జరిగిపోతే క్షమించమని నిన్ను ప్రార్థేయపడుతున్నాము'. (అహ్మద్)

దైవేతరుల పేర ప్రమాణం చేసినందుకు పరిహారం ఏమిటి? దీని గురించి మహాప్రవక్త(స) ఇలా వక్కాణించారు:**'ఎవరయినా లాత్, ఉజ్జాలపై ప్రమాణం చేస్తే వారు లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడు) అని అనాలి'.** (బుఖారీ,ముస్లిం)

అపశకునాలు చూసినందుకు చెందే ప్రాయశ్చిత్తం గురించి చెబుతూ ఆయన(స) ఇలా అన్నారు: 'అపశకునం మూలంగా తన సంకల్పాన్ని విరమించుకున్నవాడు షిర్క్‌కు పాల్పడ్డాడు'. మరి దీనికి ప్రాయశ్చిత్తం ఏమిటి? అని సహచరులు అడిగితే ఆయన (స) ఇలా అన్నారు: 'మీరు ఈ దుఆ చేయండి: **"ఓ అల్లాహ్! నీ మేలు తప్ప మరే మేలూలేదు. నీ భాగ్యం రేఖ తప్ప మరే భాగ్య రేఖాలేదు. నీవు తప్ప మరో నిజదైవం లేనే లేదు."** (అహ్మద్)

May .indd 16 5/5/12 2:04 PM

నెలవంక మాజి సంపాదకుల వారి కువైట్ రాక శుభ సందర్భాన్ని పురస్కరించుకొని జరిగిన సమావేశం

ఆద్యంతం ఎంతో ఆహ్లాదంగా జరిగిన ఈ సమావేశాని భారత దేశం నుంచి విచ్చేసిన గౌరవనీయులైన శ్రీ అజీజుర్రహ్మాన్ గారు ముఖ్య వక్తగా వ్యవహరించారు. ధర్మ మార్గంపై ఏవిధంగా సహన స్థయిర్యాలు కలిగి ఉండాలో ప్రవక్త (స) వారి సహచరుల జీవితాల్ని ఉదాహరిస్తూ వివరించారు. ఈ సభకు హాజరైన పలువురు తెలుగు శిష్యులు తమ గురువు గారి విశిష్ఠతను శ్లాఘించారు. సోదరులు ఉమర్, గురువు గారిని దుశ్శాలువతో సన్మానించారు. ఐపిసి ప్రబోధకులు శ్రీ బిలాల్ గారు గురువుతో తన మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. చివరిలో సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు అందరికీ నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకు న్నారు.

ఫీమా ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ సూచనలు

13-04-2012 వ తేదీ శుక్రవారం ఫీమా ఆధ్వర్యంలో దాని సభ్య సంస్థలయిన చిఫ్లూన్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, పురూస్ వెల్ఫేర్ సొసైటీ మరియు **'ది యంగ్ రిలీఫ్ ఫండ్ ఆఫ్ తాగూర్ వాడి'** సంఘాలు కలిసి విద్యార్థులకు పదవ తరగతి తర్వాత తీసుకోవాల్సిన కోర్సుల గురించి, మరియు భవిష్యత్ ప్రణాళికలు ఏర్పరుకోవడంలో అవలంబించాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈ రంగ నిపుణులయిన రిజ్వి యాజమాన్యం మరియు పరిశోధన సంస్థ డైరక్టరు డా. కలీమ్ ఖాన్ మాట్లాడుతూ, తాము సాధించ లేకపోయిన కలల్ని తమ పిల్లలు సాధించి పెట్టాలని పిల్లలపై అర్థరహితమైన ఒత్తిడి చేయరాదని, వారికి ఏమి కావాలో, వారు ఏం కాదల్చుకున్నారో తెలుసుకుని వ్యవహరించాలని తల్లిదండ్రులకు హితవు పలికారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐపిసి సహాయ నిర్దేశకులు శ్రీ అబ్దుల్ అజీజ్ అద్దువైజ్ గారు మాట్లాడుతూ అసంఖ్యాక అవకాశాలున్న నేటి వృత్తి, విద్యా ప్రపంచంలో సరైన వృత్తి, విద్యను ఎంచుకోవడం, అందులో నిష్ణాతులుగా ఎదగడం, అందు నిమిత్తం మొదటి నుంచే ప్రణాళిక బద్ధంగా ప్రయత్నించడం చాలా అవసరమని చెప్పడంతోపాటు, ఈ మేరకు కృషి చేస్తున్న సంస్థలు అభినందనీయమని కొనియాడారు.

May .indd 17 5/5/12 2:04 PM

మానవ మహోపకారి మహమ్మద్ (స)

అనాథలకు ఆశ్రయం:

అంతేకాకుండా ముహమ్మద్9స), ఇలా బోధించారు: "పేదలు, అనాథలు, వితంతువులు, ఏ ఆధారంలేని స్త్రీలకు సేవచేస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేస్తూ ఉండేవాడు - దైవమార్గంలో ధర్మపోరాటం చేసే వారి లాంటివాడు. లేదా పగలంతా ఉప వాసం పాటిస్తూ రాత్రిళ్ళు(దైవారాధనలో)గడిపే వారితో సమానుడవుతాడు." (సహీహ్ ముస్లిమ్, నెం.7468, పుస్తకం 53, అధ్యా.2. సంపుటి 7)

దానశీలి:

దైవప్రవక్త (స)ను ఏదైనా వస్తువు అడిగినప్పుడు ఆయన ఏనాడు లేదని అనలేదు. ఆయన మరణించిన నాడు ఆయన ఆస్తి అంతా కొన్ని నాణేలు మాత్రమే. వాటిలో కొన్నింటిని అప్పు తీర్చడానికి, మరికొన్నింటిని ఇంటికి వచ్చి అర్థించిన బీదవారికి ఇవ్వడం జరిగింది. ఆయన తుది శ్వాస వదిలే సమయానికి ఒంటిపై ఉన్న బట్టలకు అసంఖ్యాకమైన అతుకులు! ప్రపంచాన్నంతా వెలుతురు చిమ్మిన ఆయన ఇంట చిమ్మచీకటి క్రమ్ముకుంది - దీపంలో పొయ్యడానికి ఇంట్లో చమురే లేదు.

సిగ్గూ బిడియం :

కాబా గృహం నిర్మించేటప్పుడు, హజ్రత్ అబ్బాస్ మరియు బాలుడైన ముహమ్మద్(స) వారు రాళ్ళు మోస్తున్నారు. హజ్రత్ అబ్బాస్ ముహమ్మద్(స)తో, మీ లుంగీ తీసి భుజం మీద పెట్టు కోండి. రాళ్ళు ఒత్తుకోకుండా ఉంటాయి అన్నారు. లుంగీని భుజాన వేసిన వెంటనే ముహమ్మద్(స) భూమ్మీద పడిపోయారు. చూపులు ఆకాశం వైపునకు ఉన్నాయి. స్పృహ వచ్చిన వెంటనే నా లుంగీ, నా లుంగీ అని అరవనారంభించారు. ఆయన లుంగీ వెంటనే కట్టడం జరిగింది. మరో ఉల్లేఖనంలో, ఆ తరువాత ఆయన మర్మాంగం ఎన్నడూ అగుపడలేదు" అని ఉంది. (సహీహ్ బుఖారీ, నెం.3829, పుస్తకం....., అధ్యా....., సంపుటి....)

హజ్రత్ అబూ సయీద్ అల్-ఖుద్రీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త(స) పరదాలో ఉండే కన్నెపిల్ల కంటే కూడా ఎక్కువ సిగ్గుపడేవారు. (సహీహ్ ముస్లిమ్, 6032, పుస్తకం 43, సంపుటి 6)

న్యాయం:

దైవప్రవక్త(స)వారు తన కుమార్తె 'ఫాతిమా(ర) వారిని' తనలోని ఓ భాగంగా చెప్పేవారు. ఆమె అంటే ఆయన(స)కు ఎంతో ప్రేమ. ఓసారి మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. దైవప్రవక్త(స) ఆమెకు హస్తఖండన శిక్ష విధించారు.

దానిపట్ల ఖురైష్ తెగవాళ్ళు తీవ్ర ఆందోళన చెందారు. వారు పరస్పరం సంప్రదించుకుని ఈ విషయంలో దైవప్రవక్త(స)తో ఎవరు మాట్లాడుతారు అని అన్నారు. అప్పుడు కొందరు సలహా ఇస్తూ ఈ విషయమై దైవప్రవక్త(స)తో మాట్లాడగల వారు ఒక హజ్రత్ ఉసామా బిన్ జైద్(స) మాత్రమేనని, ఆయన్ని దైవప్రవక్త(స) అమితంగా అభిమానిస్తారని అన్నారు. చివరికి వారంతా హజ్రత్ ఉసామా(ర)ని దైవ ప్రవక్త(స)తో మాట్లాడి ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు ఒప్పించారు. హజ్రత్ ఉసామా(ర) దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి వారి విన్నపాన్ని ఆయన ముందుంచారు. అది విని దైవప్రవక్త(స) హజ్రత్ ఉసామా(ర)తో ఇలా అన్నారు: "ఏమిటి, నీవు అల్లాహ్ నిర్ణయించిన శిక్షలలో ఒక శిక్ష గురించి సిఫారసు చేయదలి చావా?" అన్నారు. ఆ తరువాత ఆయన లేచి నిలబడి ప్రజల ముందు ఉపన్యసించారు. ఆ ఉపన్యాసం చివర్లో ఆయన ఇలా అన్నారు - "స్థితిమంతుడు పేరు పలుకుబడులు గల వ్యక్తి దొంగతనం చేస్తే అతడ్ని శిక్షించేవారు కాదు. ఈ కారణంగానే మీకు పూర్వం గతించిన జాతులు నాశనమయ్యాయి. అల్లాహ్ సాక్షి! ముహమ్మద్ కూతురు ఫాతిమా (ర) దొంగతనం చేసినా సరే, నేనామె చేతిని నరికివేస్తాను." (అబూదావూద్, సహీహ్ హదీస్,నెం.4373, పుస్తకం 37, అధ్యా,4 సంపుటి5)

ధైర్యం:

హజ్రత్ అలీ (ర) గారి ఉల్లేఖనం: 'యుద్ధజ్వాలలు బాగా రాజుకొని భయంకరమైన యుద్ధం జరిగేటప్పుడు మేము దాని ధాటికి తట్టుకోలేక దైవప్రవక్త(స)ను అడ్డుగా పెట్టి ఆయన వెనుకన నిలుచుండే యుద్ధం చేసేవారం. ఆయన కంటే మరెవ్వరూ శత్రువుకు దగ్గరగా ఉండేవారు కాదు.

May .indd 18 5/5/12 2:04 PM

యుద్ధ నీతి:

యుద్ధ మైదానాన్ని మానవీకరించారు ముహమ్మద్(స). యుద్ధ నియమాలకి సంబంధించి ముహమ్మద్ (స) జారీ చేసిన ఆదేశాలు: ప్రాజ్ఞతకు చేరని బాలల్ని, స్త్రీలను, వృద్ధుల్ని చంప రాదని, ఖర్జూరపు చెట్టును, ఫలాలనిచ్చే చెట్లను నరకడమో, కాల్చడమో చెయ్యరాదని, ఆరాధనల్లో నిమగ్నులయి ఉన్న స్త్రీ పురుషుల ఏకాగ్రతను భంగపరచరాదని, విశ్వాస భంగం చెయ్య కూడదని, చిత్రవధకు ఒడిగట్టరాదని, వంచనకు పాల్పడ కూడదని, మాయోపాయం కూడదని, ఇటువంటి నియమాలను ప్రవక్త(స) తన అనుచరులకి జారీ చేశారు.

ఇస్లాం ప్రకారం, శరణువేడిన వాడిన వదిలివేయడమే కాకుండా అతనికి రక్షణ కూడా కల్పించాలి. దైవ విశ్వాసులలోని ఇటు వంటి లక్షణాలను గమనించడం వల్లనే, తరువాతి కాలంలో ముస్లిముల వశమైన దేశాలలోని ప్రజలు ఇస్లాం స్వీకరించడం జరిగింది. కత్తితో ఇస్లాం వ్యాపించలేదు. మానవత్వంతోనే వ్యాపించింది.

యుద్ధ ఖైదీలతో ముస్లిములు వ్యవహరించిన తీరు

దైవప్రవక్త(స) ఆదేశం ప్రకారం, యుద్ధఖైదీల బాధ్యతను, గెలిచిన వీరుల ఆధీనంలో ఉంచారు. పూర్వపు ఆచారం ఏమి టంటే, యుద్ధ ఖైదీలు వీరుల దగ్గర బానిసలుగా ఉండాలి. కాని ఖైదీల దగ్గర సద్వర్తనంతో మెలగాలని అల్లాహ్ యొక్క ఆదేశం. ఈ యుద్ధ ఖైదీలు ఎవరో కాదు, ఒకప్పుడు తమను ఎంతగానో హింసించిన వారే. అయినప్పటికీ, అది దృష్టిలో పెట్టుకోకుండా వారితో మృదువుగా వ్యవహిరంచాలని ముహమ్మద్(స) తన అనుచరులకు హితవు చేశారు. వారికి ఆహారం, వస్త్రాల లోటు రానీయకుండా చూడాలని, జబ్బుపడితే చికిత్స చేయించాలని, ఇతర ముఖ్యావసరాలు కూడా స్తోమతను బట్టి తీర్చాలని నొక్కి చెప్పారు.

ఓ అన్సారీ వీరుడయితే, తన దగ్గరున్న ఖైదీని తనకంటే మిన్నగా చూసుకున్నాడు. ఒక్కోసారి ఇంట్లో భోజనం సరిపడకపోతే తను ఖర్జూరపండ్లు తిని ఖైదీకి తృప్తిగా భోజనం పెట్టేవాడు. ఖైదీగా వచ్చిన తనే, తన యజమానికన్నా ఎక్కువ సుఖం అనుభవిస్తు న్నాడు. యజమాని చూపుతున్న అసామాన్య ఔదార్యం, మంచిత నాలను చూసి ఖైదీ సిగ్గుపడి పోయేవాడు. దాదాపు ముస్లిం వీరు లందరూ తమ ఖైదీల పట్ల సద్భావంతోనే మెలిగారు.

మక్కాలోని ఖైదీల బంధువుల ద్వారా నష్టపరిహారంగా కొంత ధనం తీసుకుని, ఈ ఖైదీలను విడుదల చేయడం జరిగింది. ఆ విధంగా నష్టపపరిహారం చెల్లించలేని పేద ఖైదీలలో, ఒక్కొక్కరు పదేసి ముస్లిం బాలబాలికలకు చదవడం, వ్రాయడం నేర్పి విముక్తి పొందమని ప్రకటించారు. చదువురాని నిరుపేద ఖైదీల ను నష్టపరిహారం లేకుండానే విడిచిపెట్టారు.

దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం ఏ ప్రాంతం నుండయితే ముహమ్మద్ (స) ఒకే ఒక అనుచరుడితో నిస్సహాయస్థితిలో నలు వైపుల నుండి బద్ధవిరోధులు వెంటాడుతుండగా పోవలసి వచ్చిందో ఆ ప్రాంతానికే ఇప్పుడు పదివేల మంది సమర యోధులతో నిర్భయంగా విచ్చేస్తున్నారు.

మక్కా విజయం:

మక్కా నగరం నాలుగు ద్వారాల నుండి నలుగురు సేనాపతుల పర్యవేక్షణలో నగరంలోకి సైన్యాన్ని ప్రవేశించమని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆ తరువాత వీరులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా తమతో యుద్ధానికి తలపడిన వారితో మాత్రమే పోరాడాలని, అనివార్య పరిస్థితి ఏర్పడినప్పుడు తప్ప ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకూడదని ఆయన హితవు చేశారు. అయితే దైవప్రవక్త(స) ప్రత్యేకంగా కొందరి పేర్లను తెలిపి వారిని మాత్రం ఎక్కడ కన్పించినా హతమార్చాలని ఆదేశించారు. అబూసుఫ్యాన్‌కు (అప్పటికి ఆయన ఇస్లామ్ స్వీకరించలేదు) ముహమ్మద్ (స) అభయమిస్తూ ఇలా అన్నారు "ముహమ్మద్ ఒక మంచి సోదరుడిలా మక్కాలో ప్రవేశిస్తాడు. ఈ రోజు విజేతలు గాని, పరాజితులు గాని ఎవరూ లేరు. ఈ రోజు శాంతీసమైక్యతల రోజు, ప్రేమా సౌభ్రాతృ త్వాల రోజు, స్వంత ఇండ్లలో ఉండి తలుపులు మూసుకునేవారికి, కాబాలో ప్రవేశించేవారికి రక్షణ ఉంది. అలాగే అబూసుఫ్యాన్ ఆశ్ర యం పొందేవారికి కూడా రక్షణ ఉంది."

ముహమ్మద్(స) ఒంటెమీద కూర్చొని నగర ముఖద్వారం గుండా మక్కాలో ప్రవేశిస్తున్నారు. ఒంటె మీద ఎంతో అణుకువతో, వినయ విధేయతలు కలిగిన దైవదాసుడిగా శిరస్సును ఒంటె మూపురం దాకా వంచి మరీ, దైవవాణి పఠిస్తూ ప్రవేశిస్తున్నారు! ఈ అపూర్వ దృశ్యం బహుదైవారాధకులను ఆశ్చర్యచకితుల్ని చేసింది.

ముస్లిం సేనలు శాంతియుతంగా మక్కాలో ప్రవేశించాయి.
కత్తులు, ఈటెలకు పని తగల్లేదు. రక్తం ప్రవహించలేదు.
కాబా ప్రాంగణంలో వేలాది జనం గుమిగూడి ఉన్నారు.
వీరందరూ ఎవరో కాదు – ముహమ్మద్(స) వారిని మరియు
ఆయన్ని విశ్వసించిన వారిని ఎన్నో హింసలు పెట్టిన
సత్యతిరస్కారులే.

వీరు ముహమ్మద్(స)ని నానాహింసలు పెట్టి వేధించినా, పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసినా, మూడేండ్లపాటు సంఘ బహిష్కరణ చేసినా, స్వస్థలం వదలిపెట్టిపోయేలా తీవ్రమైన వత్తిడి తెచ్చినా, మదీనాపై దాడిచేసినా, దైవగృహాన్ని దర్శించనీయకుండా ఆటంక పరచినా సరే, వారందరినీ ముహమ్మద్(స)క్షమించారు. వారిపై అపార కరుణామృతాన్ని చిలికించారు. ప్రతీకారానికి స్వస్తి చెప్పి అమితమైన ఔదార్యం కనబరిచారు. వీరికి శిక్ష విధించకుండా బానిసలుగా బంధించకుండా స్వేచ్ఛ ప్రసాదించి వదలిపెట్టారు.

ఇన్ని గొప్ప లక్షణాలు, ఒకే కాలంలో, ఒకే వ్యక్తిలో ప్రపంచంలో మరే వ్యక్తిలోనూ లేవు. ఒక్క ముహమ్మద్(స) వారిలో తప్ప. ఇది చారిత్రక వాస్తవం.

ఇలాంటి మానవోత్తముడిని ప్రఖ్యాత విమర్శకులు, చరిత్రకారులు అత్యంత ఉన్నత స్థాయిలో ప్రశంసిస్తే, కొందరు ఆయన్ను విమర్శి స్తున్నారు. పాఠకులారా! ఆలోచించండి! వాస్తవాలను తెలుసుకోండి.

May .indd 19 5/5/12 2:04 PM

తాహిరా బేగం

వేసిన ఉల్లిపాయలతో మసాలా వంకాయలు

కావలసిన సామగ్రి:కావలసిన సామగ్రి:

వంకాయలు 3 మధ్య తరగతి సైజు గలవి
మైదా పిండి (హర్దహ్) 2 టేబల్ స్పూన్లు
నిమ్మ రసం 2 టీ స్పూన్లు
తరిగిన ఉల్లిపాయలు 2 మధ్య తరగతి సైజు గలవి(నిలువుగా కోయ బడినవి)
పెరుగు (జబాదీ) 11/2 టేబల్ స్పూన్లు
ధనియాల పొడరు పావు టీ స్పూను (1/4)
ఉప్పు పావు టీ స్పూను (1/4)
వెల్లుల్లిపాయలు పావు టీ స్పూను (1/4)
ఓలివ్ ఆయిల్ 3 టేబల్ స్పూన్లు
దానిమ్మ పండు ముక్క అలంకరణకై
వెజిటేబల్ ఆయిల్
ఉల్లిపాయలు వేంచుటకు సరిపడునంత

తయారు చేయు విధానము:

వంకాయల్ని రెండు ముక్కలుగా నిలువునా కోయాలి. నిప్పులపై లేక గ్రిల్ మంటలో వాటిని కాల్చాలి.
తరిగిన ఉల్లుపాయల్ని నూనెలో ఎర్ర రంగు వచ్చే వరకు వేపాలి తొక్క తీసిన వంకాయలు, వేగిన ఉల్లుపాయలు మరియు మిగిలిన సామగ్రిని ఆలివ్ ఆయిల్ మరియు దానిమ్మ పండు తప్ప అన్నీ మిక్సర్‌లో వేసి మూడు సెకనులుగా గ్రైండు చేయాలి.
గ్రైండు చేసిన వంకాయలు మిశ్రమాన్ని ఒక సర్వింగ్ ట్రేలో వేసి దానిని, దానిమ్మ గింజలు, వేపిన ఉల్లిపాయలు మరియు ఓలివ్ వేసి అలంకరించాలి.

హల్లూమ్ (చీజ్) సాలెడ్

కావలసిన సామగ్రి:

పాలకూర 2 కట్టలు
అమెరికన్ సాలెడ్ ఆకులు 1 పెద్దది లేక 1/2 మీడియమ్ సైజుది
ఎర్ర మిరపకాయ చప్పనిది 1 పెద్దది
తాజా పుదీన ఆకులు 1/2 కట్ట
వెనిగర్‌లో పెట్టిన కుకుమ్‌బరు (ఖియార్)పూర్తి 1కుకుమ్‌బరు ముక్కలు
చీజ్ హల్లూమ్ 10 ముక్కలు
బీజాలు తీయబడినవి నల్ల ఆలివ్ కాయలు 3 టేబల్ స్పూన్లు
ఉడకపెట్టిన వంకాయ ముక్కలు 15
వెజిటేబల్ ఆయిల్ హల్లూమ్ మరియు మిరపకాయలు వేపుటకు సరిపడునంత

సోస్:

నువ్వులతో కూడిన జాతర్ 2 టేబల్ స్పూన్లు
రెడీమేడ్ ఇటాలియన్ సోస్ 11/2 టేబల్ స్పూన్లు
ఆలివ్ ఆయిల్ 1/4 కప్పు
నిమ్మ రసం 1/4 కప్పు
నివిగార్ 11/2 (ఒకటిన్నర)టేబల్ స్పూన్లు
వెల్లుల్లిపాయలు తరిగినవి లేక నూరినది 1 టీ స్పూను
ఉప్పు మీ అభిరుచికి సరిపడునంత

తయారు చేయు పద్ధతి:

పాలకూర మరియు సాలెడ్ ఆకులను పెద్ద పెద్దగా తరగాలి, వాటిలో పుదీనా ఆకులు, ఆలివ్ కాయలు, కుకుమ్‌బరు, ఉడకపెట్టిన వంకాయలు మరియు వెల్లుల్లిపాయలు కలుపు కోవాలి.
ఒక మూకుడులో కాస్త నూనె పోసి ఎర్ర మిరపకాయను కాస్త రంగు మారేంత వరకు వేపాలి, తరువాత దాన్ని ఒక ప్రక్కకు పెట్టి దానిలేనే చీజ్ హల్లూమ్ వేయాలి.
మిరపకాయ మరియు హల్లూమ్ మిశ్రమాన్ని కాసేపు చల్లారుటకు ఉంచాలి, చల్లారిన తరువాత మిగతా సాలెడ్ సామగ్రిని దానిలో కలుపుకోవాలి.
అన్నింటిని చక్కగా ఒక గరిటతో కలిపి అప్పటికప్పుడే సర్వ్ చేయాలి.

May .indd 20 5/5/12 2:04 PM

నిరతం నీ సేవలో తరించాలని ఉంది!

విశ్వాసి తన ప్రభువయిన అల్లాహ్ మహత్మ్యాన్ని, ఆయన ఘనకీర్తిని ప్రతిస్తుతిస్తూ ఉంటాడు. తనను పుట్టించి, పోషిస్తున్నది, కాపాడుతున్నది ఆయనేనని మనస్ఫూర్తిగా నమ్ముతాడు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదని, సకల ఉపాసనారీతులన్నీ ఆయనకే అంకితం అని విశ్వసిస్తాడు. తత్ఫలితంగా అతని ఆంతర్యం అల్లాహ్ పట్ల ప్రేమ, అభిమానం, భక్తి, భయం, మర్యాదతో నిండి పోతుంది. మనలో సయితం అట్టి భక్తిప్రపత్తులను సృజించే కొన్ని మర్యాదల్ని తెలుసుకుందాం!

మేము అల్లాహ్ దాసులం. ఆయన చెయ్యమని ఆదేశించిన ప్రతి విషయాన్ని పాటిస్తాము. ఆయన వారించిన, హెచ్చరించిన వాటి నుండి కడు దూరంగా మసలుకుంటాము. ఆయన అవిధేయత, ఆగ్రహానికి కారణభూతమయ్యే ఏ ఒక్కరి మాటను వినము.

వాక్కు, ధన, తన పరమైన ఆరాధనలన్నింటినీ ఆయనకే అంకితం చేస్తాము. ఆయనతోపాటు ఇంకెవ్వరిని భాగస్వాములు గా చేసి పూజించము. మా దినచర్యల్లో ఎలాంటి ప్రదర్శనాబుద్ధి కి చోటివ్వము. ప్రతి విషయంలోనూ అల్లాహ్ పట్ల అంకితభావం చిత్తశుద్ధి కలిగి జీవిస్తాము.

మేము అల్లాహ్‌నే నమ్ముకుంటాము. జీవిత రంగాలన్నింటిలోనూ ధర్మానికి లోబడి బాహ్య కారకాలను అనుసరించడంతో పాటు ఆయన మీదే భారం మోపుతాము. ఆయన్నే పరమోన్నత మిత్రుని గా విశ్వసిస్తాము. మా ప్రతి అవసరాన్ని – చిన్నదయినా పెద్ద దయినా ఆయనతోనే చెప్పుకుంటాము. తల మొండెం నుండి వేరయినా మా శిరస్సును ఆయన పవిత్ర సన్నిధిలో తప్ప ఇంకెక్కడా వంచము.

అల్లాహ్ మాకు ప్రసాదించిన అపార అనుగ్రహాలకుగాను ఆయనకు నిండు మనస్సుతో ధన్యవాదాలు తెలుపుకుంటాము. మాపై ఉన్న ఆయన అనన్య అనుగ్రహాలకుగాను మేము వాక్కు, తనం, ధనం ద్వారా ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుకుం టాము. నిర్లక్ష్యత, సోమరితనం, అవిధేయత నుండి ఆయన శరణు వేడుకుంటాము.

మేము అందరికన్నా అధికంగా కరుణామయుడయిన అల్లాహ్‌ను ప్రేమిస్తాము. ఆయన ప్రసన్నత కోసం మా సర్వస్వాన్ని సయితం త్యాగం చేయడానికి మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటాము. ఆయన పట్ల మాకున్న ఆశాభయాలను మా సదాచారం ద్వారా నిరూపించుకుంటాము.

ఆయన ఆదేశాలను, ఆజ్ఞలను, తీర్పులన్నింటిని న్యాయబద్ధమయి నవిగా నమ్ముతాము. వాటిలోని ఆంతర్యం మా పరిమిత మేధ పరిధిలోకి రాకపోయినా అందులో మా హితమే దాగుంటుందని విశ్వసిస్తాము. ఆయన పట్ల సదా మేము సదాభిప్రాయమే కలిగి ఉంటాము. శంకకు, సందేహానికి తావివ్వము. ఆయన మాకు కలిమిని ప్రసాదిస్తే కృతజ్ఞతలు చెల్లించుకుంటాము. ఒకవేళ లేమికి గురి చేస్తే ఓర్పు సహనం పాటిస్తాము. ఆ రెంటినీ మా పాలిట శుభ సూచకంగానే తలుస్తాము.

నిరతం మేము అల్లాహ్‌నే మొరపెట్టుకుంటాము. మా గోడును ఆయనతో మాత్రమే చెప్పుకుంటాము. ఎన్నిసార్లు చెప్పుకున్నా మా గోడు విని విసుగు చెందని దయామయుడు ఆయనొక్కడే. కాబట్టి మా తప్పులు, పాపాలకుగాను పశ్చాత్తాపం చెంది, ఆయన్ను మన్నింపు కోసం వేడుకుంటాము. ఒక నేరానికి భౌతికంగా ఆయన విధించిన శిక్షకు శిరసావహిస్తాము. మా ప్రతి మొరను ఆలకించేవాడు ఆయన మాత్రమేనని, మా కొరికల్ని తీర్చడం ఆయనకొక్కడికే సాధ్యం అని నమ్ముతాము.

జీవితాంతం ముస్లింలుగానే జీవించాలని, ఒకవేళ మరణం సంభవిస్తే విశ్వాస స్థితిలోనే మరణించాలని కోరుకుంటాము.

May .indd 21 5/5/12 2:04 PM

శ్రమే సమస్యకు పరిష్కారం

భక్తి, భయం లేని, ఉద్యోగ అవకాశాలు లేని, విద్యా అవసరాలు తీరని, నీతికి విలువ లేని, నాతికి వలువ లేని, నిత్యవసరాలు అందుబాటులో లేని, తన, మాన, ధనాలకు రక్షణ లేని వ్యవస్థను ఎవరు కోరుకుంటారు చెప్పండి. పై సమస్యలు తొలగాలి అంటే, మనం దైవం తర్వాత మన శ్రమను నమ్ముకోక తప్పదు. ఎందుకంటే స్థితి మారాలి, సమాజం మారాలి, మనం గొప్పవారమై పోవాలి అన్న ఆరాటం ఉంటే సరిపోదు; దాని కోసం శ్రమించడం కూడా వచ్చి ఉండాలి. శ్రమతో, పోరాటంతో పోయేది ఏమి లేదు, లేమి, బానిసత్వం తప్ప. నిర్లక్ష్యతతో, బద్ధకంతో ఒరిగేదీ ఏమి లేదు, దారిద్ర్యం, గులాంగిరి తప్ప. మన ప్రతిసామర్థ్యాలకు ఆచరరణలు గీటురాయి అవ్వాలి. మనం ఆశల కొరకు కాకుండా, ఆశయాల కోసం బ్రతకాలి. ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేసుకోని, మనసుని ఉత్తేజ పరచుకొని, మరో మంచి కార్యానికి కార్యోన్ముఖులం అవ్వాలి. కేవలం మనం చేయాల్సిన పనుల గురించిన అవగాహనే కాకుండా మనం చేయకూడని పనుల అవగాహన కూడా మనకుండాలి. మానవాళి హితం కోసం కష్ట పడే మనం నిజాల్ని ధైర్యంగా ఒప్పుకోని, మనలోని బలహీనతలను, బలగాలుగా మార్చుకోవాలి. మన విచారాలన్నింటి ని కృషి అనే ఆయుధం ద్వారా పోగొట్టుకోవాలి. అలా మనం చేసిన నాడు మన కలలు పండుతాయి. మన ఆశలు, ఆశయాలు నెరవేరుతాయి.

మీ వాణిజ్య ప్రకటనలను స్వాగతిస్తోంది. అధర్మమైన, అసభ్యకరమైన, అశ్లీలంతో కూడిన విషయాలు తప్ప మిగిలిన ప్రకటనలన్నీ వేయబడతాయి.

	Description	Advertisement Rate	30% Discount for One year	20% Discount for one Month
1	Inside Page of Front Cover	KWD 150	KWD 105	KWD 120
2	Inside Page of Back Cover	KWD 150	KWD 105	KWD 120
3	Single Page Inside	KWD 100	KWD 70	KWD 80
4	Two middle pages	KWD 200	KWD 140	KWD 160
5	Back Cover Page	KWD 200	KWD 140	KWD 160

Half Page : Half of the above mentioned rates ❖ Quarter Page : Quarter of the above mentioned rates

contact: abdussalamsyed@ymail.com, Tel.No: 97248933